


epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

TELANGANA RISING
CURE - PURE - RARE

సంపుటి : 19 సంచిక : 81 | 05-06-2026 శుక్రవారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 8 వెల : రూ.1.00



## కేరళను తాకిన నైరుతి రుతుపవనం

ఇంతకాలం మండుటెండలతో అల్లాడిపోతున్న ప్రజలకు ఉపశమనం కలిగించేలా చల్లని కబురు వచ్చేసింది. కేరళకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. దాంతో కేరళ తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.

2



2

## అమీర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం

హైదరాబాద్ అమీర్‌పేటలో గురువారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. శ్రీనివాసనగర్ వెస్ట్‌లో, మెట్రో పిల్లర్ నంబర్ - 1043 సమీపంలో ఉన్న కేఎస్సార్ ఫ్యాషన్స్ దుకాణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదం కారణంగా మంటలు భారీగా ఎగసిపడ్డాయి. దీంతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి.

# తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తాం



### ఉద్యమకారుల సంఘాలను కలిసి వివరాలు సేకరిస్తాం

### అఖిలపక్ష భేటీలో కమిటీ చైర్మన్ కేశవరావు

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ప్రత్యక్షంగా.. పరోక్షంగా పాల్గొన్న ఉద్యమకారులందరికి న్యాయం చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని కె. కేశవరావు స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం కె. కేశవరావు అధ్యక్షతన ఏర్పాటైన కమిటీతో గురువారం హైదరాబాద్ సచివాలయంలో అఖిల పక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం కేకే మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉద్యమకారుల సంఘాలను మళ్లీ కలుస్తామని అన్నారు. అందుకోసం ఉద్యమకారులందరినీ పిలిచి మాట్లాడతామని పేర్కొన్నారు.

వార్త 2లో





## పవన్ కళ్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడారా?

### మీటింగ్‌కు అనుమతి ఎందుకు ఇవ్వలేదో చెప్పాలి

### ఇంకా సెంటిమెంట్ రాజకీయాలతో మోసం చేస్తే ఊరుకోరు

### బిఆర్ఎస్, కాంగ్రెస్‌ల తీరుపై మండిపడ్డ బిజెపి అధ్యక్షుడు

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా ఎప్పుడు మాట్లాడలేదని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. ఆయన మీటింగ్‌కి అనుమతి ఇస్తే ఏమవుతుందని రాంచందర్ రావు ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్‌లో రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ సెంటిమెంట్‌ని మరోసారి రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు.

వార్త 2లో

## సూడాన్ ప్రయాణికుడికి ఎబోలా లక్షణాలు

### తోనమే గాంధీ ఆస్పత్రికి తరలింపు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఓ ప్రయాణికుడి ఎబోలా వైరస్ హిస్టరీ ఉన్నట్టు గుర్తించారు. గురువారం సూడాన్ నుంచి నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకున్న మహ్మద్ అనే ప్రయాణికుడికి.. ఎయిర్‌పోర్టులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్క్రీనింగ్ కేంద్రంలో పరీక్షలు నిర్వహించారు. ఎబోలో




వైరస్ హిస్టరీ ఉన్నట్టు గుర్తించిన వైద్య సిబ్బంది వెంటనే అప్రమత్తయ్యారు. వెంటనే అతన్ని గాంధీ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఐసోలేషన్ సెంటర్‌కు తరలించారు. శాంపిల్స్ సేకరించి సీసీఎంబీకి పంపించినట్టు గాంధీ ఆసుపత్రి వైద్యులు తెలిపారు.



2

## ఖరీఫ్ పంటకైనా రైతు భరోసా కల్పించాలి

### బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి డిమాండ్

2

## ఇండియా కూటమికి బీటలు

8వతేదీ ఇండీ కూటమిని బహిష్కరించిన డీఎంకే హాజరు కాబోవడం లేదని ప్రకటన విడుదల

## మరోమారు ప్రకాశ్ రాజ్ సెటైర్లు

### ఘాటుగా తిప్పికొట్టిన నిర్మాత బండ్ల గణేశ్

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అంశంలో నటుడు ప్రకాశ్ రాజ్, నిర్మాత బండ్ల గణెళిశ్ మధ్య సోషల్ మీడియా ఎక్స్‌లో వార్ నడుస్తోంది. తెలంగాణలో జనసేన పోటీ చేస్తుందంటూ పవన్ చేసిన వ్యాఖ్యలపై ప్రకాశ్ రాజ్ సెటైర్ వేస్తే.. ప్రకాశ్ రాజ్‌కు బండ్ల గణెళిశ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో జనసేన పోటీపై ఎక్స్‌లో పోస్ట్ చేసిన ప్రకాశ్ రాజ్.. పవన్‌ను ఉద్దేశించి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'మీరొస్తామంటే మేమొద్దంటామా.. రండి దొర. సింగిల్‌గా వస్తున్నారా.. పొత్తుతో వస్తున్నారా చెప్పి రండి' అని ప్రకాశ్ రాజ్ పోస్ట్ చేశారు. ప్రకాశ్‌రాజ్ పోస్ట్‌కు బండ్ల గణెళిశ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ప్రతి దాంట్లో ఎందుకు వేలు పెడతావంటూ ప్రశ్నించారు. 'అసలు నువ్వెవరు.. తమిళోడివా? తెలుగోడివా? కన్నడిగుడివా? ప్రతి విషయంలో జడ్జిమెంట్ ఇవ్వడానికి నువ్వేమైనా ప్రధానివా. అందరి విషయాల్లో దూరి హీరోలా ఫీలవ్వకు. ముందు నీ అడ్రస్ నువ్వు తెలుసుకో. తర్వాత ప్రపంచాన్ని మార్చే ప్రయత్నం చేయ్' అంటూ ప్రకాశ్ రాజ్‌ను ఉద్దేశించి బండ్ల గణెళిశ్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ప్రకాశ్ రాజ్, బండ్ల గణెళిశ్ మధ్య సోషల్ మీడియా ఎక్స్ వేదికగా జరుగుతున్న వార్.. చర్చనీయాంశంగా మారింది.

## మార్కెట్ వ్యాల్యూ ప్రకారం భూముల ధరలు



### నేటి నుంచే అమల్లోకి పెంచిన రేట్లు

### రూ.1200 నుంచి

### రూ.1400 కోట్ల మేర ఆదాయం

### సబ్ రిజిస్ట్రార్ల అధికారాలకు కత్తెర

### రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2 లో..

# తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తాం

## ఉద్యమకారుల సంఘాలను కలిసి వివరాలు సేకరిస్తాం

## అఖిలపక్ష భేటీలో కమిటీ చైర్మన్ కేశవరావు





హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ప్రత్యక్షంగా.. పరోక్షంగా పాల్గొన్న ఉద్యమకారులందరికి న్యాయం చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని కె. కేశవరావు స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం కె. కేశవరావు అధ్యక్షతన ఏర్పాటైన కమిటీతో గురువారం హైదరాబాద్ సచివాలయంలో అఖిల పక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం కేకే మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉద్యమకారుల సంఘాలను మళ్లీ కలుస్తామని అన్నారు. అందుకోసం ఉద్యమకారులందరినీ పిలిచి మాట్లాడతామని పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం చేయాలన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని వివరించారు. ఈ అఖిల పక్షం సమావేశంలో అన్ని పార్టీల నేతలు పాల్గొన్నారని చెప్పారు. విద్యార్థులతో, ఉద్యమకారుల సంఘాలతో అనుబంధం ఉన్న వారిని మళ్లీ కలుస్తామని కె.కేశవరావు తెలిపారు. ఉద్యమకారులందరిని పిలిచి మాట్లాడుతామన్నారు. తెలంగాణ తొలి దశతోపాటు మలి దశ ఉద్యమకారులందరికీ న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తుందని పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం చేసేందుకు రాజకీయాలకు అతీతంగా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలంగాణ రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందుకోసం ఉద్యమకారులందరితోనూ మాట్లాడతామన్నారు. నష్టపోయిన అందరికీ న్యాయం చేస్తామని చెప్పారు. ఈ ప్రజా పాలన ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించడానికి ఏర్పాటు చేసిన కమిటీ.. అఖిలపక్ష పార్టీల నుంచి ఇద్దరి చొప్పున పిలిచామని పేర్కొన్నారు. పార్టీలు మాత్రమే కాకుండా ఉద్యోగ, విద్యార్థి, జర్నలిస్ట్, న్యాయవాదులు అందరినీ పిలిచి మాట్లాడతామని వివరించారు. కవులు, కళాకారులు తెలంగాణ సాధన కోసం పని చేసిన అందరిని గుర్తిస్తామన్నారు. ఈ ప్రక్రియ అమరవీరుల ద్వీపంలో ప్రారంభమవుతుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు గౌరవం ఇవ్వాలని, వారిని గుర్తించాలని, అలాగే అందరి నుంచి సూచనలు స్వీకరించాలని నిర్ణయించామన్నారు. రాజకీయాలకు అతీతంగా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విజ్ఞప్తులు స్వీకరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. ఉద్యమ సమయంలో తన జీవితంలో యవ్వనం పోయిందని.. మమ్మల్ని ఆదుకోవాలని ఉద్యమకారులు కోరుతున్నారని ఎమ్మెల్సీ కోదండరాం తెలిపారు. అందుకోసం ఉద్యమకారుల జేఏసీలు ఉన్నాయని.. వారిందరినీ కలుస్తామన్నారు. అలాగే అన్ని యూనివర్సిటీల జేఏసీలు ఉన్నాయని.. వారితో కూడా సమావేశమవుతామని ఎమ్మెల్సీ కోదండరాం స్పష్టం చేశారు. ప్రజా సంఘాలు, కుల సంఘాలు, విద్యార్థి జేఏసీ, యూనివర్సిటీ జేఏసీలను సంప్రదిస్తామని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ వెల్లడించారు. అందరి సలహాలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన అని చెప్పారు. స్టేక్ హోల్డర్స్‌ను పిలిచి మాట్లాడతామన్నారు. అందరి అభిప్రాయాలు తీసుకొని ఉద్యమకారులను గుర్తిస్తామని పేర్కొన్నారు.

## కేరళను తాకిన నైరుతి రుతుపవనం

### మరో వారం రోజుల్లో తెలంగాణకు రాక

తిరువనంతపురం, అక్షరకలం ప్రతినిధి

ఇంతకాలం మండుటెండలతో అల్లాడిపోతున్న ప్రజలకు ఉపశమనం కలిగించేలా చల్లని కబురు వచ్చేసింది. కేరళకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. దాంతో కేరళ తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇక అక్కడ ఇనుంచి తమిళనాడు, కర్నాటక, ఆంధ్రాలకు విస్తరిస్తాయి. మరో వారంలోపే ఈ రుతుపవనాలు తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉంది. అయితే గతంతో పోలిస్తే ఈసారి నైరుతి రుతుపవనాలు కొంత ఆలస్యంగా వచ్చాయి. వాస్తవానికి మే 26వ తేదీననే నైరుతి రుతపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ముందుగా అంచనా వేసింది. కానీ, ఎల్‌నినో ప్రభావంతో ఆ అంచనాలు తలకిందుల య్యాయి. కాగా రుతుపవనాల ప్రభావంతో ఇప్పటికే కేరళలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అలప్పుళ, కొట్టాయం, ఎర్నాకుళం జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో అటు తమిళనాడులోని 15 జిల్లాల్లోనూ రానున్న కొన్ని గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరిక జారీచేసింది. ఇదిలావుంటే.. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది నైరుతి రుతుపవన కాలంలో (జూన్–సెప్టెంబర్) సాధారణం కంటే తక్కువ వర్షపాతమే నమోదవుతుందని వాతావరణ విభాగం అంచనా వేసింది. దీర్ఘకాల సగటుతో పోలిస్తే 90శాతం వర్షమే ఈ సీజన్‌లో కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నది. పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో ఎల్‌నినో పరిస్థితులు ఆవిర్భవిస్తున్నాయని, జూన్‌లో ఇవి బలహీనంగా ఉన్నా సెప్టెంబర్‌లో మాత్రం బలంగా ఉండే అవకాశం ఉందని తెలిపింది.

## అమీర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం

### కేఎస్సార్ ఫ్యాషన్స్ దుకాణంలో మంటలు

### ఆస్తి, ప్రాణనష్టంపై అందని వివరాలు

### రంగంలోకి దిగిన ఫైర్ ఇంజన్లు, పోలీసులు

### అమీర్‌పేట-ఎస్సార్ నగర్ మధ్య ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

హైదరాబాద్ అమీర్‌పేటలో గురువారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. శ్రీనివాసనగర్ వెస్ట్‌లో, మెట్రో పిల్లర్ నంబర్ – 1043 సమిపంలో ఉన్న కేఎస్సార్ ఫ్యాషన్స్ దుకాణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదం కారణంగా మంటలు భారీగా ఎగసిపడ్డాయి. దీంతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి. అగ్నిప్రమాదం సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. మంటలు వేగంగా వ్యాపించకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. దట్టమైన పొగ కారణంగా పరిసర ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు తెలుస్తోంది. భవనంలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు కూడా కొనసాగాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. అగ్నిప్రమాదంలో ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం ఎంత మేరకు జరిగిందనే విషయంపై అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అగ్నిప్రమాదం కారణంగా అమీర్‌పేట నుంచి ఎస్సార్ నగర్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో పరిసర ప్రాంతాల్లో భారీ ట్రాఫిక్ జామ్ నెలకొంది. ట్రాఫిక్ పోలీసులు వాహనాలను ఇతర మార్గాల వైపు మళ్లిస్తూ పరిస్థితిని నియంత్రించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలు, వాహనదారులు అమీర్‌పేట–ఎస్సార్‌నగర్ మార్గాన్ని తాత్కాలికంగా నివారించి ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలని అధికారులు సూచించారు. అలాగే విధుల్లో ఉన్న ట్రాఫిక్, అగ్నిమాపక సిబ్బంది, ఇతర అత్యవసర సేవల సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం వివరాలు అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది.

## పవన్ కళ్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడారా?

### మీటింగ్‌కు అనుమతి ఎందుకు ఇవ్వలేదో చెప్పాలి

### ఇంకా సెంటిమెంట్ రాజకీయాలతో మోసం చేస్తే ఊరుకోరు

### బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల తీరుపై మండిపడ్డ బిజెపి అధ్యక్షుడు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా ఎప్పుడు మాట్లాడలేదని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. ఆయన మీటింగ్‌కి అనుమతి ఇస్తే ఏమవుతుందని రాంచందర్ రావు ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్‌లో రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ సెంటిమెంట్‌ని మరోసారి రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణను వ్యతిరేకించిన ఎంఐఎంని ఎందుకు దగ్గరకు తీసుకున్నారని ప్రశ్నించారు. తెలంగాణ సెంటిమెంట్ పేరుతో మళ్లీ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాంచందర్ రావు ఆగ్రహించారు. తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడిన వారితో చేతులు కలిపింది ఎవరో..? బీఆర్ఎస్ నేతలు చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని శక్తులతో అధికార రాజకీయాలు చేసింది ఎవరు..? అని నిలదీశారు. తెలంగాణను తిట్టిన వారిని, ఉద్యమకారులను అవమానించిన వారిని బీఆర్ఎస్‌లో చేర్చి పదవులు ఇచ్చింది ఎవరు..? అని ప్రశ్నించారు. తెలంగాణ పేరుతో రాజకీయాలు చేసే ముందు మీ రాజకీయ చరిత్రను ఒకసారి ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం మీద ప్రేమ ఉంటే డ్రామాలు కాదని... నిజాలు మాట్లాడాలని సవాల్ విసిరారు. ప్రజలు ఇప్పుడు భావోద్వేగాలకు కాదని, మీ గతానికి కూడా లెక్క అడిగే స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్.. జనసేన సభ కోసం అనుమతి అడిగారని... ఇచ్చి ఉంటే కథ అక్కడే ముగిసేదని.. సభకు అనుమతి ఎందుకు ఇవ్వలేదో కాంగ్రెస్ సర్కార్ చెప్పాలని రాంచందర్ రావు ప్రశ్నించారు. ఈ సమావేశం పెట్టుకోవడం ప్రతి ఒక్కరి ప్రజాస్వామ్య హక్కు అని చెప్పారు. దాన్ని అడ్డుకోవడమే ఎందుకు జరిగిందో సమాధానం చెప్పాలని నిలదీశారు. పవన్ కల్యాణ్ అంశాన్ని బీజేపీ మీద రుద్దే ప్రయత్నం చేయడం రాజకీయ దివాళాకోరుతనమని ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ కలిస్తేనే కొందరి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు. తెలంగాణను వ్యతిరేకించిన వారికి కేసీఆర్ హయాంలో మంత్రి పదవులు ఇచ్చారని రాంచందర్ రావు ఆగ్రహించారు. ఏపీలో



బీఆర్ఎస్ ఆఫీస్ పెట్టలేదా..? అని ప్రశ్నించారు. తెలంగాణ నిధులను పంజాబ్‌లో కేసీఆర్ పంచలేదా..? అని నిలదీశారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించలేని పరిస్థితిలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉందని విమర్శించారు. బీజేపీ సపోర్ట్ చేయడంతోనే తెలంగాణ వచ్చిందని పేర్కొన్నారు. ఆనాడు పార్లమెంటులో తమ పార్టీ మద్దతు ప్రకటించిందని అన్నారు. సుష్మా స్వరాజ్ బేషరతుగా మద్దతు ఇస్తేనే తెలంగాణ వచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ సర్కార్ ఇస్తానని చెప్పిన జాబ్ క్యాలెండర్ ఏమైంది..? అని రాంచందర్ రావు ప్రశ్నించారు. 12 ఏళ్ల నుంచి నీళ్ల మీద ఒక పాలసీ కూడా ఎందుకు తేలేదని నిలదీశారు. తెలంగాణకు రావాల్సిన నీళ్ల వాటా కంటే తక్కువ వాటాను కేసీఆర్ ఒప్పుకున్నారని ప్రస్తావించారు. రాష్ట్రానికి రావాల్సిన కృష్ణా జలాలను డీకే శివకుమార్‌కి.. రేవంత్‌రెడ్డి బహుమతిగా ఇచ్చారని విమర్శించారు. మిగులు బడ్జెట్‌గా ఉన్న తెలంగాణను అప్పుల్లోకి నెట్టారని ధ్వజమెత్తారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ సూపర్ హీరో అని రాంచందర్ రావు అభివర్ణించారు. ముమ్మందు బిజెపి తెలంగాణలో కీలకంగా మారుతుందన్నారు.

## ఖరీఫ్ పంటకైనా రైతు భరోసా కల్పించాలి

### బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి డిమాండ్

జగిత్యాల, అక్షరకలం ప్రతినిధి

రాష్ట్ర ప్రజానికంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందుచూపు లేదని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి ఆరోపించారు. వానకాలం పంట సీజన్ మరికొద్ది రోజుల్లో ప్రారంభమవుతున్నా గాని ప్రభుత్వానికి ముందస్తు కార్యచరణ ప్రణాళికను ఇంకా తయారు చేసుకోలేదని వెల్లడించారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట రుణాలకు సంబంధించి కార్యచరణను ఇంకా రూపొందించ లేదని ఆరోపించారు. కనీసం ఖరీఫ్ పంటకైనా రైతు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా మూడు సంవత్సరాల కాలంలో ఆరు పంటలు పండాయని, ఇందులో ఎన్ని పంటలకు రైతు భరోసా కల్పించారో ఆయన ఆత్మకే తెలుసని విమర్శించారు. ధాన్యం సేకరణపై కాంగ్రెస్ , బీజేపీలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ రైతు గురించి ఆలోచించడం లేదని విమర్శించారు. పప్పు దినుసులు, నూనె గింజలు పండించాలని సలహా ఇస్తున్న ప్రభుత్వం వాటికి ఏ విధమైన ప్రోత్సాహం కల్పిస్తుందో చెప్పడం లేదని పేర్కొన్నారు. కోతుల బెడద నుంచి పంటలను కాపాడేందుకు కోతుల పునరుత్పత్తి నిలుపుదల కేంద్రాన్ని జిల్లాకు ఒకటి ఏర్పాటు చేయాలని, తక్షణమే రైతుకు సోలార్ ఫెన్సింగ్ 50 శాతం రాయితీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్కెట్లో యూరియా అందుబాటులో లేదని, యూరియా యాప్‌ను తొలగించి నేరుగా రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## మార్కెట్ వ్యాల్యూ ప్రకారం భూముల ధరలు

### నేటి నుంచే అమల్లోకి పెంచిన రేట్లు

### రూ.1200 నుంచి రూ.1400 కోట్ల మేర ఆదాయం

### సబ్ రిజిస్ట్రార్ల అధికారాలకు కత్తెర

### రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

మార్కెట్ వ్యాల్యూ ప్రకారం భూముల ధరలు శుక్రవారం నుంచి పెరుగుతాయని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. భూముల ధరలు ఏరియాను బట్టి 50 నుంచి100 శాతం పెరుగుతాయని తెలిపారు. ప్రైమ్ ఏరియాలో 100 శాతం పెరుగుతాయన్నారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విలేకర్లతో మాట్లాడారు. భూముల వ్యాల్యూ పెరగటంతో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1200 నుంచి రూ.1400 కోట్ల మేర ఆదాయం వస్తుందని చెప్పారు. హయ్యర్ సైడ్ ఏరియాలు శేరిలింగంపల్లి, రాజేందర్ నగర్, ఖాజాగూడ తదితర ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగవన్నారు. ఆయా ప్రాంతాల్లో ఛార్జీలు పెంచే ఆలోచన ప్రభుత్వానికి లేదని తెలిపారు. ఇక నుంచి సబ్ రిజిస్ట్రార్లకు ఫుల్ పవర్స్ కట్ చేశామని.. వారికి మినిమమ్ పవర్స్ మాత్రమే ఉంటాయని మంత్రి పొంగులేటి వివరించారు. భూ సేకరణ సమయంలో ప్రభుత్వానికి కొంత నష్టం జరిగిందన్నారు. కానీ రైతులకు మాత్రం లాభం జరుగుతుందన్నారు. ఇన్నర్ సైడ్ ఎకరం కనీసం రూ.15 లక్షలు ఉందని చెప్పారు. లోయర్ సైడ్ ఏమైనా పొరపాటు జరిగితే మార్పులు చేర్పులు ఉంటాయని చెప్పారు. హయ్యర్ సైడ్ మాత్రం మార్పులు ఉండవన్నారు. సమస్యలు ఉంటే.. హెల్ప్ డెస్క్ ఫోన్ నెంబర్ ఏర్పాటు చేస్తామని పబ్లిక్‌కు ఆయన సూచించారు. త్వరలో తహసీల్దార్ల బదిలీలు ఉంటాయని చెప్పారు. ఫ్యూచర్ సిటీని రద్దు చేసి అవకాశమే లేదని స్పష్టం చేశారు. రెవెన్యూ విషయంలో.. తెలంగాణను మిగతా రాష్ట్రాలు మోడల్‌గా తీసుకుంటున్నాయని గుర్తు చేశారు. ఏడాదిన్నరలో 90 శాతం గ్రామాల సర్వే పూర్తవుతుందని ధీమా వ్యక్తం చేశారు. రెవెన్యూలో అవినీతి లేకుండా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఆ క్రమంలోనే అవినీతి నిరోధక శాఖ ట్రాప్‌లు అధికంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ÷ూను వచ్చాక ఏసీబీ ట్రాప్ అయిన ÷ల్స్ అన్ని క్లియర్ చేశానని తెలిపారు. గత ప్రభుత్వంలో మూడేళ్లు రెవెన్యూ ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. కానీ తాను వచ్చిన మూడు నెలల్లోనే 3,500 రెవెన్యూ ఫైల్స్ క్లియర్ చేశానని వివరించారు. అసెంబ్లీలో పెండింగ్‌లో ఉన్న 10 ఏళ్ల ఫైల్స్ ఆరు నెలల్లోనే క్లియర్ చేసినట్లు చెప్పారు. తనకు ఏ శాఖ కేటాయించినా.. కళ్లు మూసుకొని పని చేస్తానని పేర్కొన్నారు. ÷-రజలకు, ప్రభుత్వానికి మంచి జరిగే ఏ పని చేయడానికైనా తాను భయపడనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుండబద్దలు కొట్టారు. ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇండ్లకు రూ. 7 వేల కోట్లు చెలించామని చెప్పారు. రాష్ట్రంలో పాడి ప్రోక్యూర్‌మెంట్ 90 శాతం పూర్తయిందన్నారు. అసైన్డ్ భూములకు పాలసీ తీసుక వస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్లు జరిగినవని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం వాటిని నిషేధిత జాబితా లో చేర్చిందని మంత్రి పొంగులేటి వివరించారు.

## రేవంత్ పర్యటన.. ముందుస్తు అరెస్టులు

జోగులాంబగద్వాల అక్షరకలం ప్రతినిధి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం గద్వాల జిల్లాలో పర్యటన సందర్భంగా పోలీసులు బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా హౌస్ అరెస్టు చేశారు. గద్వాల నియోజకవర్గ నాయకుడు బాసు హనుమంతు నాయుడును పోలీసులు అర్ధరాత్రి నుంచి హౌస్ అరెస్ట్ చేశారు. అదేవిధంగా పార్టీ సీనియర్ నాయకులు నాగర్ దొడ్డి వెంకట్ రాములు, కురువపల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్.కేశవ్‌ను అరెస్టు చేయడం పట్ల హనుమంతు నాయుడు మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలనలో పోలీస్‌ల పహారాలు, నిర్బంధాలు ఎందుకని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. ప్రజా ప్రభుత్వం అంటూ బీరాలు పలుకుతూ ప్రతిపక్ష నాయకులపై అంక్షలు ఎందుకని నిలదీశారు. మూడు సంవత్సరాల పాలనకే ఇంత అభద్రతాభావమా.. ఇంతటి అరాచకమా? అని మండిపడ్డారు. పెండింగ్ ప్రాజెక్టులపై ప్రతిపక్ష పార్టీల సూచనలను, ప్రజల ఆలోచనలను పరిగణనలోకి తీసుకోకుండా హడావుడిగా ప్రాజెక్టుల సందర్శన చేపట్టడం విచారకరమని అన్నారు. బీఆర్ఎస్ నాయకుల అరెస్టును తీవ్రంగా ఖండించారు.

## ఇండియా కూటమికి బీటలు

### 8వతేదీ ఇండీ కూటమిని బహిష్కరించిన డిఎంకె

### హాజరు కాబోవడం లేదని ప్రకటన విడుదల

న్యూఢిల్లీ,

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం తమిళనాడులో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఇండియా కూటమికి బీటలు వారాయి. ఇందులో భాగస్వామి అయిన డీఎంకే కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 8వ తేదీన దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగే ఇండియా కూటమి సమావేశాన్ని బహిష్కరించాలని డీఎంకే నిర్ణయించింది. కాంగ్రెస్ పార్టీ పాల్గొనే ఈ భేటీకి వెళ్లే ప్రసక్తే లేదంటూ చెన్నైలోని డీఎంకే ప్రధాన కార్యాలయం గురువారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ తమకు తీవ్ర ద్రోహం చేసిందంటూ డీఎంకే సంచలన ఆరోపణలు చేసింది. కాంగ్రెస్ పార్టీ వైఖరితో డీఎంకే శ్రేణులు తీవ్ర మనస్తాపం చెందాయని వివరించింది. అందులో భాగంగా కేడర్ భావాలను గౌరవిస్తూనే ఇండియా కూటమి భేటీకి దూరంగా ఉండాలని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం ఎం.కె. స్టాలిన్ నిర్ణయం తీసుకున్నట్లు ఆ ప్రకటనలో వివరించింది. జూన్ 8వ తేదీన ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ వేదికగా ఇండియా కూటమి అత్యవసర సమావేశం జరగనుంది. ఈ కూటమి సమావేశానికి హాజరు కావాలని ఆ పార్టీ భాగస్వామ్య కూటమిల నుంచి డీఎంకేకు ఆహ్వానం అందింది. అయినప్పటికీ.. హాజరు కాకూడదని డీఎంకే అధిష్ఠానం నిర్ణయించింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ ప్రవర్తించిన తీరుపై డీఎంకే శ్రేణుల్లో తీవ్ర ఆగ్రహం వచ్చింది. తమ పార్టీ కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీ చేసిన ద్రోహాన్ని క్షమించేది లేదంటూ డీఎంకే ఒక ప్రకటన విడుదల చేసిన విషయం విదితమే. ఇండియా కూటమి ఏర్పడినప్పటి నుంచి డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా డీఎంకే గుర్తు చేసింది. నీట్, ఒకే దేశం–ఒకే సారి ఎన్నికలు, వక్ఫ్ చట్టాలకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో తమ పోరాటం కొనసాగుతుందని డీఎంకే వెల్లడించింది. కూటమితో భేటీకి దూరంగా ఉన్నప్పటికీ, ప్రజా వ్యతిరేక విధానాలపై ఇతర పార్టీల పోరాటాలకు మద్దతు ఇస్తామని డీఎంకే ప్రకటించింది. దీంతో డీఎంకే – కాంగ్రెస్ బంధంలో వివాదం ముదిరినట్లు అయింది. అంతేకాకుండా జాతీయ స్థాయిలో ప్రతిపక్ష కూటమికి డీఎంకే భారీ షాక్ ఇచ్చినట్లు అయింది.

## బ్యాటరీల దొంగ తనాలకు పాలు పడుతున్న దొంగల అరెస్టు



జగిత్యాల జూన్ 4 (అక్షర కలం)

రూరల్ ధరుర్ గ్రామ శివారులో రూరల్ ఎస్సై ఉమాసాగర్ పోలీసులు తనిఖీలు చేస్తున్న సమయంలో ఆటోలో బ్యాటరీలు ముగ్గురు వ్యక్తులు అనుమాన స్పందన కనిపించగా వారిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించి నిందితుల వద్ద నుండి 39 బాటరీ లు, 4 ఖూా లు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ 4,52000 రూపాయలు ఉంటుందని తెలిపారు వీరు జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన బండి అంజయ్య, మండలి రవి, చేమల్ల నరేష్ అనే ముగ్గురు నిందితులను గురువారం అరెస్టు చేసి నిందితులను రిమాండ్ కు పంపనున్నట్లు రూరల్ సీఐ సుధాకర్ తెలిపారు.

## బడి బాట సమర్థవంతంగా నిర్వహించాలి...

### – ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలి.....

### – జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్.....

మెదక్/ కొల్చారం జూన్ 04( అక్షర కలం)



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ లోని మీటింగ్ హాల్లో విద్యాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం మెరుగైన విద్యా ప్రమాణాల లక్ష్యంగా ముందుకు పోతూ బడి బాట సమర్థవంతంగా నిర్వహించాలని,విద్యార్థుల తక్కువ నమోదు పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థుల నమోదు పెంచుటకై గ్రామంలోని ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేయాలని, కనీస సామర్థ్యాలు అయినటువంటి చదవడం రాయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పాఠశాలల్లో ఏర్పాటు చేసే మౌలిక వసతుల గురించి తల్లిదండ్రులకు వివరించాలని, వీటి ఆధారంగానే పాఠశాలలకు ప్రగతి సూచికలు ఇవ్వబడతాయని ,రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రీ ప్రైమరీ పాఠశాలలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అలాగే ఎఫ్ఆర్ఎస్, ఇతర అంశాలపై దృష్టి పెట్టి సరియగు చర్యలు గైకొనాలని సూచించారు ,జిల్లాలోని భవిత కేంద్రాల బలోపేతానికి కృషి చేయాలని, కొత్త ప్రీ ప్రైమరీ విభాగాలను ప్రారంభించాలని, విద్యార్థుల సంఖ్యలేని పాఠశాలలను తిరిగి ప్రారంభించాలని, పాఠ్యపుస్తకాల పంపిణీ చేయాలని, స్వయం సహాయక బృందాల చేత పిల్లలకు యూనిఫామ్ కుట్టించాలని, నూతన టెక్నాలజీ ఏఐ, డిజిటల్ తరగతులను నిర్వహించాలని, విద్యాశాఖ బలోపేతానికి ప్రత్యేక కార్యచరణ ప్రకారం ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజు, చీఫ్ మానిటరింగ్ ఆఫీసర్ రాజు, ఏ ఎం ఓ సుదర్శన మూర్తి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## రేపు అక్కన్నపేట నగర్ వన్ యోజన పార్కులో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు....

### అటవీ శాఖ ఆధ్వర్యంలో

### 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' కార్యాచరణ...

### – ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్నారు....

మెదక్/ కొల్చారం జూన్04(అక్షర కలం):-

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' లో భాగంగా మెదక్ జిల్లాలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో జూన్ 1 నుండి జూన్ 12 వరకు ప్రత్యేక పర్యావరణ ఇతివృత్త కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. ఇందులో భాగంగా జూన్ 5 (రేపు) ఉదయం 9:30 గంటలకు మెదక్ జిల్లాలోని అక్కన్నపేట నగర్ వన్ యోజన పార్క్ వేదికగా ఈ ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు జరగనున్నాయి.ఈ పర్యావరణ మహోత్సవానికి జిల్లాలోని ప్రముఖ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. పర్యావరణ పరిరక్షణ, అడవుల విస్తరణ, మరియు ప్రకృతి సమతుల్యతను కాపాడటంపై ఈ సందర్భంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు మరియు మొక్కలు నాటే కార్యక్రమాలను చేపట్టనున్నారనీ,మెదక్ జిల్లా అటవీ శాఖ అధికారి జోజి గురువారం ఒక ప్రకటనలో కోరారు.



## ముఖ్యమంత్రి జిల్లా పర్యటన విజయవంతం

### గుడ్డెం దొడ్డి పంపుహౌస్ ను పరిశీలించిన ముఖ్యమంత్రి.

### జిల్లా ప్రాజెక్టులపై ఫోటో ఎగ్జిబిషన్, పీపిటి ప్రజెంటేషన్.

### సీఎం పర్యటనకు భారీ బందోబస్తు.

జోగులంబ గద్వాల జిల్లా అక్షర కలం ప్రతినిధి





జూరాల ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ద్వారా చేపట్టిన జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన గుడ్డెం దొడ్డి జలాశయం సామర్థ్యాన్ని 11 లేదా15 టీఎంసీలకు పెంచాలని స్థానిక ప్రజా ప్రతినిధులు, ఇరిగేషన్ శాఖ అధికారుల ప్రతిపాదనల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం పంపు హౌస్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారులు ముఖ్యమంత్రికి జిల్లాకు అవసరమైన నీటి వనరుల సామర్థ్యం పెంపునకు అవసరమైన ప్రతిపాదనలను వివరించారు. ముఖ్యంగా గూడెం దొడ్డి ప్రాజెక్టు 15 టిఎంసిలకు పెంచడం, ర్యాలంపాడు సీపేజీ సమస్యను పరిష్కరించి నాలుగు టీఎంసీల నీటి స్టోరేజ్ నిలువ చేసే విధంగా చర్యలు చేపట్టాల్సి ఉందని అలాగే మల్లమ్మ కుంట భూసేకరణ పనులను చేపట్టాల్సిందని తెలియజేశారు. ఈ సందర్భంగా ధరూర్ మండలంలోని గుడ్డెం దొడ్డి రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్ద గురువారం సాయంత్రం 4:30 ప్రాంతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తదితరులు బొకేలు, మొక్కలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి సీఎం రోడ్డు మార్గంలో జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన స్టేజ్1 గుడ్డెం దొడ్డి పంపు హౌస్ వద్దకు చేరుకొని మంత్రులతో కలిసి జోగులాంబ గద్వాల జిల్లాలోని నీటి పారుదల ప్రాజెక్టులపై పిపిటి ద్వారా సమీక్ష నిర్వహించారు. అంతకుముందు జిల్లా ప్రాజెక్టుల గురించి ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను తిలకించారు. అనంతరం తిరిగి వెళ్లే సమయంలో సీఎం కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులకు, మీడియా ప్రతినిధులకు అభివాదం చేస్తూ కరచాలనం చేశారు. ఈ సందర్భంగా అభిమానులు సీఎంకు పుష్పగుచ్చాలు, శాలువాలు, జ్ఞాపికలు అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రత చర్యలతో పాటు, పకడ్బందీ ఏర్పాట్లు చేసి స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారుల సహకారం, సమన్వయంతో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసినట్లు గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, పశు సంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, కర్నాటక మంత్రి బోసురాజు, గద్వాల, అలంపూర్ శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, విజయుడు, రాష్ట్ర వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, గొర్రెలు, మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ సరిత, అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ సీఈ రహీముద్దీన్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## జనగణనను పకడ్బందీగా నిర్వహించాలి..

## జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్.....

మెదక్/కొల్చారం జూన్ 04(అక్షర కలం):



జనగణన కార్యక్రమాన్ని అధికారులు, సిబ్బంది సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జనగణన అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూజనగణన దేశ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు, సంక్షేమ పథకాల అమలుకు అత్యంత కీలకమైన ప్రక్రియ అని తెలిపారు. ప్రతి ఇంటిని సందర్శించి, ప్రజల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జనగణన నిర్వహించాలన్నారు.జనగణన సిబ్బందికి అవసరమైన శిక్షణ, సామగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు కూడా జనగణన సిబ్బందికి సహకరించి సరైన సమాచారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు.జనగణన విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, జనగణన సిబ్బంది పాల్గొన్నారు.

## కొడంగల్ ఎత్తిపోతల ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు

### ప్రాజెక్టు పనుల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ పరిశీలన

### త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

నారాయణపేట,

మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. బీమా కృష్ణా నదులపై నిర్మించనున్న ప్రాజెక్టు పనుల పురోగతిపై గురువారం ముఖ్యమంత్రి బెంగుళూరు నుంచి నేరుగా మక్తల్ చేరుకోగా ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలకు జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఫోటో గ్యాలరీని ముఖ్యమంత్రి వీక్షించారు. మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భీమా కృష్ణా నదులపై ప్రతిపాద బ్యారేజీ పనులు పురోగతికి సంబంధించిన ఫోటో ఎగ్జిబిషన్ ప్లాన్ మ్యాప్స్ ద్వారా ముఖ్యమంత్రికి వివరించిన ఇరిగేషన్ అధికారులు. ాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి మక్తల్ మండలం కాట్రేవు పల్లి గ్రామ సమీపంలో కొనసాగుతున్న మక్తల్ నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల ప్యాకేజ్ -1 పనులను గురువారం పరిశీలించారు. ప్యాకేజ్ -1 లో భాగంగా జరుగుతున్న పంప్ హౌస్ పనులు ఎంత శాతం పూర్తయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాంక్రీటు పనులను ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కర్ణాటక రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి బోసు రాజు, జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, డాక్టర్ వాకిటి శ్రీహరి, కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక, ఇరిగేషన్ కార్యదర్శి శ్రీదర్, చీఫ్ ఇంజనీరు. ఏ సత్య నారాయణ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ హెచ్.టి శ్రీధర్, ఉన్నారు.



## సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై దృష్టి

### మానవ అక్రమ రవాణాను నిరోధించేలా చర్యలు

### సుప్రీంకోర్టు పలు కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ,

పిల్లల అక్రమ రవాణా నిరోధానికి సంబంధించిన కేసులో విచారణ చేపడుతున్న సుప్రీంకోర్టు.. సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై దృష్టి సారించింది. ఈ కేసులో అమికస్ క్యూరీగా వ్యవహరిస్తున్న సీనియర్ అడ్వకేట్ అపర్ణా భట్ చేసిన సూచనలను పరిశీలించింది. మానవ అక్రమ రవాణాను నిరోధించేలా సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల కోసం ప్రత్యేక మార్గదర్శకాలు (ఎస్ఓపీ) లేవని ఆమె ఈ సందర్భంగా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సరోగసీ, ఐవీఎఫ్ క్లినిక్స్ నియంత్రణ కోసం తీసుకొచ్చిన ఏఆర్‌టీ చట్టంలో అనేక నిబంధనలు ఉన్నప్పటికీ, చిన్నారుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక ప్రోటోకాల్ లేదని అపర్ణా భట్ పేర్కొన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలు ప్రధానంగా వైద్య ప్రమాణాలు, మౌలిక వసతులకే పరిమితమయ్యాయని వివరించారు. ఈ నేపథ్యంలో నిబంధనలను మరింత కట్టుదిట్టం చేసేందుకు రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీ సూచనలతో సమగ్ర విధానాన్ని రూపొందించాలని ప్రతిపాదించారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం తన అభిప్రాయాన్ని తెలియజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 19కి వాయిదా వేసింది.

అక్షర కలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# మమతీ కోటకు బీటలు !

కాంగ్రెస్‌లో ఉండగా ఫైర్‌బ్రాండ్ పేరు తెచ్చుకుని ప్రజలకు చేరువయ్యేలా ఎత్తులు, జిత్తుల వేసిన మమతా బెనర్జీ ఇప్పుడు దాదాపుగా ఒంటరిగా మారక తప్పడం లేదు. దాదాపు పదిహేనేళ్లు పశ్చిమబెంగాల్‌ను ఏకఛత్రాధిపత్యంగా పాలించిన దీదీ నిరంకుశ పాలనకు తెరతీశారు. బెంగాల్లో అధికారమే లక్ష్యంగా ఆమె చేసిన పనులు దేశ ఐక్యతను దెబ్బతీసే స్థితికి చేరాయి.లక్షల్లో బంగ్లా దేశీయుల చొరబాట్లను ప్రోత్సహించి, ఎన్నికల్లో విజయం సాధిస్తూ వచ్చినా.. పాపం పండింది. ఇప్పుడు ఎక్కడ చూసినా బంగ్లా జీతాయులు బెంగాల్‌ను వీడిపోతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. సువేందు అధికారి పగ్గాలు చేపట్టగానే తొలుత బంగ్లాదేశాయులను తరిమివేసే కార్యక్రమం చేపట్టారు. దీంతో ఇప్పుడు సరిహద్దుల్లో వారు వేలాదిగా గుమికూడి భారత్‌ను వీడే దృశ్యాలు కనిపిస్తున్నాయి. అధికారంలో ఉండగా నిరంకుశంగా వ్యవహరించారు. ఓ స్త్రీ అధికారంలో ఉంటే ఎంతగానో అభివృద్ధి చెందాలసిన బెంగాల్ అరాచక పాలనకు కేంద్రబిందువుగా మారింది. అత్యాచారాలు, దోపిడీలు, దొంగతనాలు రాజ్యమేలాయి. ఇవన్నీ ఇప్పుడు శాపంగా మారి మమతను వెంటాడుతున్నాయి. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తృణమూల్ కాంగ్రెస్‌లో చిచ్చు రేపుతోంది. ఫలితాలు వెలువడి నెల రోజులైనా కాకముందే.. అంతర్గత విభేదాలతో పార్టీ సతమత మవుతోంది. అధినాయకురాలు మమతా బెనర్జీకి పార్టీపై ఉన్న పట్టు సడలుతున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 50 మంది తృణమూల్ ఎమ్మెల్యేలు రహస్య సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవడం.. మంగళవారం స్వయంగా దీదీ నిర్వహించిన ధర్నాకు ఆరుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలే హాజరు కావడం దీనికి బలాన్ని చేకూరుస్తోంది. దాదాపు మూడు దశాబ్దాల క్రితం అవతరించినప్పటి నుంచీ.. తృణమూల్‌లో తలెత్తిన అతిపెద్ద సంక్షోభంగా దీనిని చెప్పవచ్చు. బెంగాల్‌లో ఇటీవలి ఎన్నికల్లో తృణమూల్ తరపున 80 మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. లోక్‌సభ, రాజ్యసభల్లో కలిపి పార్టీకి 40 మందికి పైగా ఎంపీలు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత తొలిసారిగా మమత కోల్‌కతాలో భాజపా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మంగళవారం చేపట్టిన నిరసనకు ఆరుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలే హాజరవటం అందరినీ ఆశ్చర్యపరిచింది. వీరిలో డెరెక్ ఓబ్రియెన్, కల్యాణ్ బెనర్జీ, శోభన్‌దేబ్ చటోపాధ్యాయ, నైనా బందోపాధ్యాయ వంటి సీనియర్ నేతలే ఉన్నారు. కొత్తగా పార్టీ తరపున ఎన్నికైనవారెవరూ నిరసనకు హాజరవలేదు. మమత అధ్యక్షతన ఇటీవల తృణమూల్ ఎమ్మెల్యేల సమావేశాన్ని ఏర్పాటు చేయగా.. 20 మందే వచ్చారు. దీంతో ఆ సమావేశాన్ని రద్దు చేయాల్సి వచ్చింది.తృణమూల్ తమ శాసనసభా పక్ష నేతగా శోభన్‌దేబ్ ఛటోపాధ్యాయ్‌ని నియమించింది. అయితే ఆ నియామక ఉత్తర్వుల్లో తమ సంతకాలను ఫోర్జరీ చేశారంటూ పార్టీ ఎమ్మెల్యేలు



రితబ్రత బెనర్జీ, సందీపన్ సాహా స్పీకరుకు ఫిర్యాదు చేయడం కలకలం సృష్టించింది. ఈ పరిణామంతో రితబ్రత, సందీపన్‌లను తృణమూల్ సస్పెండ్ చేసింది. పార్టీలో తిరుగుబాటు వర్గానికి రితబ్రత నాయకత్వం వహిస్తున్నారు. చీలిక వర్గానికి మెజార్టీ ఉందని అతను ప్రకటించడం మమతా బెనర్జీకి మింగుడుపడని వ్యహారంగా చూడాలి. తృణమూల్ ఎమ్మెల్యేల్లోని ఓ వర్గం తమ శాసనసభా పక్ష నేతగా రితబ్రతను నియమించాలని కోరుకుం టున్నట్లు సమాచారం. పార్టీని చీల్చి, గుర్తును కూడా సొంతం చేసుకునేందుకు దాదాపు 50 మంది ఎమ్మెల్యేలు యత్నిస్తున్నట్లు స్వయంగా తృణమూల్ అధికార ప్రతినిధి రిజుదత్తా పేర్కొన్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టం నిబంధనల ప్రకారం.. అనర్హత వేటు పడకుండా ఉండేందుకు చీలిక వర్గానికి మూడింట రెండొంతుల శాసనసభ్యుల మద్దతు అవసరం. అంటే తృణమూల్ తిరుగుబాటు వర్గంలో 53 మంది ఎమ్మెల్యేలు ఉండాలి. ఆ బలం కూడగట్టుకునే ప్రయత్నాల్లో భాగంగానే దాదాపు 50 మంది ఎమ్మెల్యేలు సోమవారం రహస్యంగా సమావేశమయ్యారని సమాచారం. స్వయంగా మమత, ఆమె సన్నిహితుడు కునాల్ ఘోష్ కూడా తృణమూల్‌లో విభేదాలు ఉన్నాయని అంగీకరించారు. పార్టీ నాయకత్వానికి తెలియకుండా రహస్య సమావేశాన్ని ఏర్పాటుచేసి పార్టీలో చీలిక తెచ్చేందుకు రితబ్రత ప్రయత్నిస్తున్నట్లు కునాల్ ఆరోపించారు. వీటిని రితబ్రత ఖండించారు. అయితే టీఎంసీ కనుమరుగయ్యే అవకాశం ఉందని, అది ఇకపై మనుగడ సాధించలేదని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత 100 మంది కౌన్సిలర్లు తృణమూల్‌ను వీడారు. ఇప్పటికే పలువురు నేతలు కూడా టీఎంసీ నాయకత్వంపై ముఖ్యంగా మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ వరుస పరిణామాలు టీఎంసీకి పొంచిఉన్న సంక్షోభానికి సంకేతాలుగా కనిపిస్తున్నాయి. తృణమూల్ రెండుగా చీలనుందని, మహారాష్ట్ర పరిస్థితులే బెంగాల్‌లోనూ రానున్నాయని మంత్రి తపస్ రాయ్ వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో భాజపా గెలుపు అనంతరం తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై జరుగుతోన్న దాడులకు వ్యతిరేకంగా తృణమూల్ కాంగ్రెస్ అధినేత, మాజీ సీఎం మమతా బెనర్జీ ధర్నా చేపట్టారు. భాజపాకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడుతానని ఆమె శపథం చేశారు. దేశవ్యాప్తంగా భాజపాకు వ్యతిరేకంగా పోరాడుతున్న పార్టీలు దిల్లీలో సమావేశమవుతాయి. ఎన్ని బెదిరింపులు వచ్చినా నిరసన కొనసాగుతుందని మమత స్పష్టంచేశారు. అయితే అధజకారంలో ఉండగా అత్తా అల్లుళ్ల ఆగడాలను నేతలతో పాటు ప్రజలు కూడా సమించారు. కానీ పరిస్తితి మారింది. ఇప్పుడు బిజెపి ప్రభుత్వం ఏర్పడడంతో వీరంతా తిరుగుబాటు జెండా ఎగరువేశారు. ఏ జెండాకు ఆగొడుగు పట్టి, నానా యాగీ చేయడం మమతా బెనర్జీ నైజం. మొన్నటి ఎన్నికల్లో అలాగే చేయబోయారు. కానీ బిజెపి పన్నిన ఉచ్చులో పడ్డ మమత గిలగిల కొట్టుకోవడం మినహా చేయగ లింది లేదు. మమతను ప్రజలే ఛీత్కరించుకునే స్థాయికి వచ్చింది.

# ప్రజల సంక్షేమాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం..

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 04:**

ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో ప్రభుత్వం చేపట్టిన గ్రామ, డివిజన్, వార్డు సభలలో భాగంగా గురువారం జిల్లాలోని హాజీపూర్ మండలం రాపల్లి గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన గ్రామసభకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సాయి



వెంకట్ రెడ్డి, మండల విద్యాధికారి తిరుపతి, సర్పంచ్ రామ్ రెడ్డి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రజాపాలన – ప్రగతి ప్రణాళి 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వం జూన్ 4, 6, 8, 10 తేదీలలో ప్రత్యేక సభలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించడం జరిగిందని తెలిపారు. ఈసారి వర్షం తక్కువగా ఉన్నందున తదనుగుణంగా సాగు చేయగల పంటలను రైతులు ఎంపిక చేసుకోవాలని, ఆ దిశగా వ్యవసాయ, విస్తరణ అధికారులు రైతులకు అవగాహన



కల్పించాలని తెలిపారు. యూరియా పంపిణీకి సంబంధించి యాప్ లో నమోదు చేయబడిన రైతులు, పంట, సాగు వివరాలకు అనుగుణంగా విడతల వారీగా యూరియా అందించడం జరుగుతుందని తెలిపారు. ఒకే రకమైన పంట సాగు చేయడం వలన భూసారం తగ్గుతుందని, ఈ పరిస్థితిని అధిగమించేందుకు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని, నానో యూరియా, డిఏపి, ప్రభుత్వం చేవీకరించబడిన విత్తనాలను మాత్రమే రైతులు వినియోగించాలని తెలిపారు. భూమి రకాన్ని బట్టి దాదాపు పత్తి పంట ఎకరానికి 14 నుండి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, రైతులకు మద్దతు ధర అందించడం జరుగుతుందని తెలిపారు. చిన్న, సన్న కారు రైతులు ప్రత్యామ్నాయంగా కూరగాయల పంటల సాగుపై దృష్టి సారించాలని, పంట సాగుకు ప్రభుత్వం రాయితీ అందిస్తుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకుని లబ్ధి పొందాలని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టడం ద్వారా ఈ సంవత్సరం ఇప్పటివరకు ఎలాంటి డెంగ్యూ కేసులు నమోదు కాలేదని, ఇలాగే కొనసాగించినట్లయితే వ్యాధుల నియంత్రణ సులభతరం అవుతుందని తెలిపారు. ప్రతిరోజు తడి, పొడి చెత్తను సేకరించాలని, ఉపయోగపడే వ్యర్థాల ద్వారా కంపోస్టు చేసి రైతులకు అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం, జనగణన కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. సమగ్ర సవరణ కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని, ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. జన గణన ప్రక్రియలో వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. విద్యావవస్థ బలోపేతం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. జూనియర్ కళాశాలలలో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడం జరుగుతుందని, ఈ విద్యా సంవత్సరం వార్షిక ఫలితాలలో దాదాపు 98 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం జరిగిందని తెలిపారు. ఈ వేసవిలో ప్రజలకు ఎలాంటి త్రాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు కార్యాచరణతో చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. వైద్యం, విద్య, మహిళా రక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు అంశాలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో ప్రజలకు ఎదురయ్యే సమస్యలపై మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల తహశీల్దార్ల దృష్టికి తీసుకురావచ్చని, టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంపై అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజల కోసమే ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య**

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 04:**

ప్రజల కోసమే ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక సభలలో భాగంగా గురువారం చెన్నూరు మున్సిపల్ పరిధిలో చేపట్టిన వార్డు సభ కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్, మండల పంచాయతీ అధికారి అజ్మత్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ పి చంద్రయ్య మాట్లాడుతూ, ప్రజల కోసమే ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. మండలంలోని అక్కపల్లి గ్రామపంచాయతీలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో ఘన వ్యర్థాల నిర్వహణపై గ్రామస్తులు అవగాహన కలిగి ఉండాలని, ఇంటి వద్దనే వ్యర్థాలను పొడి, తడి, శానిటరీ, ప్రత్యేక సంరక్షణ వ్యర్థాలుగా వేరు చేయడం ద్వారా పరిశుభ్రమైన గ్రామ వాతావరణాన్ని నెలకొల్పవచ్చని వివరించారు. వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ, పునర్వినియోగం, కంపోస్టింగ్ విధానాలపై సూచనలు చేశారు. స్వచ్ఛ గ్రామ్ -- సురక్షిత జలవాయు కార్యక్రమం లక్ష్యాలు, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పుల ప్రభావాల తగ్గింపు కోసం గ్రామస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. జల



సంరక్షణ -- మన సంరక్షణ కార్యక్రమం కింద నీటి వనరుల పరిరక్షణ, వర్షపు నీటి నిల్వ, భూగర్భ జలాల సంరక్షణ, నీటి వినియోగంలో పొదుపు చర్యల ప్రాముఖ్యత, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాలు, పట్టణాలు వర్షాకాల సన్నద్ధతపై ప్రత్యేక దృష్టి సారించాలని, కాలువల శుభ్రత, నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు పరిశుభ్రత పాటించాలని తెలిపారు. రైతులు సాంప్రదాయ పంటలతో పాటు పంటల వైవిధ్యీకరణ ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చని, నీటి లభ్యత, మార్కెట్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటల సాగు, సేంద్రియ వ్యవసాయం, ఆధునిక సాగు పద్ధతులను అనుసరించాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లభించే ప్రయోజనాలు వివరించి అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన --ప్రగతి ప్రణాళిక వారాంత కార్యక్రమాల లక్ష్యాలు, గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం, ప్రణాళికాబద్ధ అభివృద్ధి ప్రాముఖ్యతను వివరించారు. చల్లాయిపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన పరిసరాలలో నిర్మించవలసిన భూగర్భ మరుగుదొడ్ల పనులకు సంబంధించి మార్కింగ్‌లు పూర్తి చేయించి పనులు ప్రారంభించి పనులను వేగవంతం చేయాలని సర్పంచ్, సంబంధిత అధికారులను



ఆదేశించారు. అనంతరం చెన్నూరు మున్సిపాలిటీ పరిధిలోని 6, 8 వార్డుల ప్రత్యేక వార్డు సభలలో మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, చైర్‌పర్సన్ పెద్దింటి పద్మ, వైస్ చైర్‌పర్సన్ నాయకపు వినయ్, సిఐ, వివిధ శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నీటి వృథాను నివారించడం, పర్యావరణ పరిరక్షణ, ప్రజా ఆరోగ్య అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని తెలిపారు. రహదారి భద్రత, ట్రాఫిక్ నియమాల పాటింపు ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) కార్యక్రమం ప్రాముఖ్యత, ఓటరు జాబితా నవీకరణలో ప్రజల భాగస్వామ్యం అవసరాన్ని వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఏఈఓలు, పోలీసు శాఖ సిబ్బంది, విద్యుత్ శాఖ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు**

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 04:**

జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని రైతుల వద్ద నుండి త్వరగా కొనుగోలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు తెలిపారు. గురువారం జిల్లాలోని వేమనపల్లి



మండలం గొర్లపల్లి, కొత్తపల్లి గ్రామాలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో, దస్నాపూర్ గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో, నీల్వాయి గ్రామంలో డిసిఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ వి రాములు మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, ధాన్యం తరలింపునకు అదనపు లారీలు సమకూర్చాలని తెలిపారు. కోటపల్లి మండలం సర్వాయిపేట గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రం, భీమారం మండలం అర్కపల్లి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంను సందర్శించి కొనుగోలు, రవాణా ప్రక్రియలను పరిశీలించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులు, గోదాములకు తరలించడం జరుగుతుందని, ఈ క్రమంలో తరలించబడిన ధాన్యాన్ని లారీల నుంచి త్వరితగతిన దిగుమతి వేగవంతం చేసి, లారీల నిల్వ సమయాన్ని తగ్గించాలని సూచించారు. అవసరమైన మేరకు లారీలను సమకూర్చే విధంగా గుత్తేదారులు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఖరీఫ్‌కు ముందే రైతుకు భరోసా కల్పించాలి

## :ప్రభుత్వం రైతు సమస్యలపై దృష్టి సారించాలి: జీవన్ రెడ్డి

**రాయికల్,జూన్ 5 (అక్షర కలం):**


ఖరీఫ్ సీజన్‌కు రైతులు సిద్ధమవుతున్న వేళ ప్రభుత్వం రైతు భరోసా, పంట రుణాలు, ఎరువుల సరఫరాపై స్పష్టమైన కార్యాచరణ చేపట్టాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ తాటిపర్తి జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. రాయికల్ మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

రైతు భరోసా అమలులో జాప్యం, పంట రుణాల మంజూరులో స్పష్టత లేకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోందన్నారు. ధాన్యం సేకరణలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. పప్పుధాన్యాలు, నూనెగింజల సాగును ప్రోత్సహించాలని సూచిస్తున్న ప్రభుత్వం వాటికి ఎలాంటి ప్రోత్సాహకాలు ఇవ్వబోతుందో వెల్లడించాలని ప్రశ్నించారు.ఆరుతడి పంటలకు కోతుల బెడద తీవ్రంగా ఉందని, ప్రతి జిల్లాలో కోతుల పునరుత్పత్తి నియంత్రణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, రైతులకు 50 శాతం సబ్సిడీపై సోలార్ ఫెన్సింగ్ అందించాలని కోరారు. విత్తనాల ధరలు భారీగా పెరిగాయని, ఆరుతడి పంటల విత్తనాలను 50 శాతం రాయితీపై అందించాలని డిమాండ్ చేశారు.వరి సన్న రకాల ధాన్యానికి ఇస్తున్న బోనస్ తరహాలోనే పప్పుధాన్యాల సాగుకు కూడా ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించాలని అన్నారు. డీఏపీ ధరలు పెరగడం, యూరియా కొరత రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని పేర్కొన్నారు. యాప్ ఆధారిత పరిమితులను తొలగించి యూరియాను అందుబాటులోకి తేవాలని కోరారు.రాజకీయాలకు అతీతంగా రైతుల సంక్షేమమే తమ లక్ష్యమని, రైతులకు మేలు చేసే నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ సమావేశంలో యువజన నాయకుడు తాటిపర్తి సీకే రెడ్డి, గోపి రాజిరెడ్డి, బర్కం మల్లేశం, కొయ్యడి మహిపాల్, ఉదయశ్రీ, శ్రీధర్ రెడ్డి, రాకేష్, గుమ్మడి సంతోష్,బత్తిని భూమన్న,నాగరాజ్, రాజేందర్ గౌడ్, వల్లకొండ మహేష్, పొన్నం శ్రీకాంత్, హరీష్ రావు, మంద రమేష్, రాజీవ్, రవి, సాయి, సత్యనారాయణ, మహేందర్, కలీల్, జక్కుల రవి, మంజూర్ తదితరులు పాల్గొన్నారు.




అక్షరకలం
తెలుగు దినపత్రిక

## ఆట



# ఆస్ట్రేలియాలో కోహ్లికి చాలా పెద్ద ఫ్యాన్ బేస్




రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్‌లో వరుసగా రెండో టైటిల్ అందుకుంది. ఆర్సీబీ విజయంపై ఆస్ట్రేలియా ఉప ప్రధాని రిచర్డ్ మార్లెస్ హర్షం వ్యక్తం చేశారు. దాంతో పాటు విరాట్ కోహ్లిని ఆకాశానికి ఎత్తుతూ ప్రశంసల జల్లు కురిపించారు. ఆస్ట్రేలియాలో విరాట్ కోహ్లికి చాలా పెద్ద ఫ్యాన్ బేస్ ఉందని చెప్పారు. గతేడాది తాను భారత్‌కు వచ్చినప్పుడు ఆర్సీబీ తొలి కప్ అందుకుందని, ఇప్పుడు రెండో టైటిల్ సొంతం చేసుకుందని ఆయన గుర్తు చేశారు. విరాట్ కోహ్లికి ఆస్ట్రేలియాలో ఎంత పెద్ద ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందో చెప్పాల్సిన అవసరం లేదు. అక్టోబర్‌లో జరిగిన కోహ్లి ఆఖరి ఆస్ట్రేలియా టూర్‌లో ఫ్యాన్స్ ఎలా బ్రహ్మరథం పట్టారో చూశాము. కోహ్లి డకౌట్లు అయినా ఫ్యాన్స్ మాత్రం మంచి సెండాఫ్ ఇచ్చారు. ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు కూడా విరాట్ కోహ్లి – రోహిత్ శర్మలకు ఘన వీడ్కోలు పలికింది. తాజాగా ఐపీఎల్‌లో ఆర్సీబీ వరుసగా రెండోసారి ఛాంపియన్‌గా నిలవడంపై ఆస్ట్రేలియా ఉప ప్రధాని కోహ్లిపై ప్రశంసల వర్షం కురిపించారు. భారత పర్యటనలో ఉన్న ఆస్ట్రేలియా ఉప ప్రధాని రిచర్డ్ మార్లెస్ ఆర్సీబీ టైటిల్ సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా విరాట్ కోహ్లిపై ప్రశంసల జల్లు కురిపించారు. ఆర్సీబీ విజయాన్ని, కోహ్లి ప్రభావాన్ని చూపిస్తూ భారత్ – ఆస్ట్రేలియా ద్వైపాక్షిక సంబంధాల గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆస్ట్రేలియాలో కోహ్లి పేరు ఎక్కువగా వినిపిస్తుందని, ప్రపంచ వ్యాప్తంగా అతని అభిమానులు ఉన్నారని గుర్తు చేశారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన మార్లెస్ ఆర్సీబీ విజయాన్ని రెండు దేశాల మధ్య పెరుగుతున్న రిలేషన్‌కు గుర్తుగా అభివర్ణించారు. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఫైనల్స్‌లో కోహ్లి 75 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఆస్ట్రేలియా ఆటగాళ్లు జోష్ హేజిల్‌వుడ్, టిమ్ డేవిడ్ కూడా తమ వంత పాత్ర పోషించారని గుర్తు చేశారు. "గతేడాది కూడా ఐపీఎల్ ఫైనల్ తర్వాతి రోజు నేను భారత్‌లోనే ఉన్నాను. ఈ సారి కూడా ఆర్సీబీ విజయం సాధించింది. విరాట్ కోహ్లి 75 పరుగులతో నాటౌట్‌గా నిలిచి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. కోహ్లితో పాటు జోష్ హేజిల్‌వుడ్, టిమ్ డేవిడ్ కూడా కీలక పాత్ర పోషించాడు. భారత్ – ఆస్ట్రేలియా కలిసి ఎలా ముందుకు సాగుతున్నాయో చూపేందుకు ఇది ఓ ఉదాహరణ" అని మార్లెస్ అన్నారు. "ప్రస్తుతం క్రికెట్‌లో విరాట్ కోహ్లి అంటే ఓ సంచలనం. నేను చిన్నప్పటి నుంచి క్రికెట్‌ను ఫాలో అవుతున్నాను.




# 3.4 కోట్లిచ్చి ఖాళీగా కూర్చోబెట్టిన లక్నో!


లక్నో సూపర్ జెయింట్స్ స్టార్ బౌలర్ మయాంక్ యాదవ్ ఐపీఎల్ 2026లో పూర్తిగా విఫలమయ్యాడు. గాయం నుంచి కోలుకుని వచ్చిన మయాంక్ 4 మ్యాచ్‌లు ఆడి వికెట్లేమీ తీసుకోలేకపోయాడు. లక్నో తరఫున 2022 నుంచి ఐదు సీజన్లు ఆడిన మయాంక్ యాదవ్ ఓవరాల్‌గా పది మ్యాచ్‌లే ఆడాడు. ఈ పది మ్యాచ్‌లలో 9 వికెట్లు పడగొట్టాడు. అయితే మయాంక్‌ను బెంచ్‌కే పరిమితం చేసిన లక్నో.. రూ. 33.4 కోట్లను అతనికి చెల్లించింది. ఐపీఎల్‌లో ఎక్కువ హైప్ తెచ్చుకుని డగౌట్‌కే పరిమితమైన ప్లేయర్ ఎవరంటే మొదటగా గుర్తొచ్చేది మయాంక్ యాదవ్ . దేశవాళీ క్రికెట్‌లో రాణించి ఐపీఎల్‌లో అడుగుపెట్టిన మయాంక్ యాదవ్ నెట్స్‌లో మెరుపు బంతులతో కోచ్‌లను కట్టిపడేశాడు.




# టీమిండియాతో అఫ్ఘనిస్థాన్ టీ 20 సిరీస్

క్రికెట్ చరిత్రలోనే తొలిసారిగా ఒక క్రికెట్ జట్టు తమ సొంతగడ్డ మీదే అతిథి జట్టుగా మారనుంది. టీమిండియాతో అఫ్ఘనిస్థాన్ ఆడనున్న టీ 20 సిరీస్‌కు భారత్ వేదిక కానుండటం విశేషం. ఈ మేరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోయినా.. సెప్టెంబర్‌లో భారత్‌ను హోం గ్రౌండ్‌గా చేసుకుని అఫ్ఘనిస్థాన్ జట్టు టీమిండియాతో టీ 20 సిరీస్ ఆడనున్నట్లు సమాచారం. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ క్రికెట్ స్టేడియం వేదికగా ఈ సిరీస్ జరగనుందని తెలుస్తోంది. భారత్ – అఫ్ఘనిస్థాన్ క్రికెట్ చరిత్రలో తొలిసారిగా అఫ్ఘనిస్థాన్ జట్టు భారత్‌ను హోస్ట్ చేయబోతోంది. సాధారణంగా హోస్ట్ చేసే జట్టు తమ సొంత దేశం వేదికగానే మ్యాచ్‌లు ఆడుతుంది. కానీ ఈ సిరీస్ అఫ్ఘనిస్థాన్‌లో కాకుండా భారత రాజధాని ఢిల్లీలో జరగనుంది. సెప్టెంబర్‌లో ఈ సిరీస్ జరగనున్నట్లు సమాచారం.

అక్షరకలం
తెలుగు దినపత్రిక



## సినిమా
CINEMA





# బోయపాటి శ్రీను, వెంకటేష్ కాంబోలో కొత్త సినిమా!


దర్శకుడు బోయపాటి శ్రీను, వెంకటేష్‌తో కలిసి కొత్త సినిమా చేయనున్నట్లు తెలుస్తోంది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'తులసి' సినిమా సూపర్ హిట్ అయింది. ప్రస్తుతం వెంకటేష్ త్రివిక్రమ్, అనిల్ రావిపూడి దర్శకత్వంలో సినిమాలు చేస్తున్నారు. ఆ సినిమాలు పూర్తయిన తర్వాత బోయపాటితో సినిమాపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. బోయపాటి శ్రీను తన కెరీర్‌లో భారీ విజయాన్ని సాధించి, తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాల్సిన అవసరం ఉంది.

# 'పెద్ది' కథ పడి లేచిన మనిషిది: బుచ్చిబాబు

దర్శకుడు బుచ్చిబాబు 'పెద్ది' గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇది కేవలం ఒక ఆటగాడి కథ కాదని, చుట్టూ ఉన్నవారిని మార్చే కథ అని తెలిపారు. అలాగే ఇది పడి లేచిన మనిషి కథ అంటూ పేర్కొన్నారు. ఈ సినిమా కోసం ఐదేళ్ల గ్యాప్ తీసుకున్నానని, రామ్ చరణ్ తన కథను ఎలాంటి మార్పులు లేకుండా అంగీకరించడం గొప్ప విషయమని ఎమోషనల్ అయ్యారు. సినిమా అవుట్‌పుట్‌పై నమ్మకం వ్యక్తం చేస్తూ, తాను 100 సార్లు చూసినా చివరి 40-50 నిమిషాలు ఎమోషనల్ అవుతానని చెప్పారు.

# రాజకీయాల్లోకి ధనుష్..!?

తమిళనాడులో సినిమా రంగానికి, రాజకీయాలకు దశాబ్దాల కాలంగా విడదీయరాని బంధం ఉంది. ఎంజీఆర్, జయలలిత, విజయ్‌కాంత్ నుంచి నిన్నటి దళపతి విజయ్ వరకు ఎంతోమంది సినీ తారలు ప్రజా క్షేత్రంలోకి వచ్చి నాయకులుగా రాణించారు. ఈ నేపథ్యంలో కోలీవుడ్ స్టార్ హీరో, జాతీయ అవార్డు గ్రహీత ధనుష్ కూడా భవిష్యత్తులో రాజకీయాల్లోకి వచ్చే అవకాశం ఉందా అనే చర్చ మళ్లీ తెరపైకి వచ్చింది. ఇటీవల విజయ్ 'తమిళగ వెట్రి కజగం' పార్టీని స్థాపించి 2026 అసెంబ్లీ ఎన్నికల్లో సంచలన విజయం సాధించిన ఈ తరుణంలో, ధనుష్ పొలిటికల్ ఎంట్రీపై ఆయన తండ్రి, ప్రముఖ సీనియర్ దర్శకుడు కస్తూరి రాజా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. చెన్నైలో జరిగిన ఒక సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న కస్తూరి రాజాకు, ధనుష్ రాజకీయ ప్రవేశంపై ఎదురైన ప్రశ్నకు ఆయన ఎంతో వ్యూహాత్మకంగా సమాధానమిచ్చారు. ఒకప్పుడు తమిళనాడు రాజకీయ దిగ్గజం కరుణానిధి జీవించిన గోపాలపురం, నేటి ముఖ్యమంత్రికి సంబంధించిన పోయస్ గార్డెన్ ప్రాంతాల ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ.. ప్రజాస్వామ్యంలో రాజకీయాల్లోకి ఎవరైనా రావచ్చునని, అది వారి వ్యక్తిగత ఇష్టమని పేర్కొన్నారు. తనకు వయసు అయిపోయింది కాబట్టి తాను రానని, కానీ భవిష్యత్తులో తన కొడుకులు ధనుష్, సెల్వరాఘవన్ లేదా తన మనవళ్లు కూడా రాజకీయాల్లోకి అడుగుపెట్టవచ్చుని స్పష్టం చేస్తూ ఊహాగానాలకు మరింత బలాన్ని చేకూర్చారు. ఈ సందర్భంగా కస్తూరి రాజా తన పాత రోజులను గుర్తుచేసుకుంటూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్**

**అమ్మ' పేరుతో ప్రతి ఒక్కరూ మొక్క నాటి సంరక్షించాలని పిలుపు**

**బంగారుగడ్డ గ్రామసభలో ఇందిరమ్మ ఇళ్లు, మహిళా సాధికారతపై కలెక్టర్ దిశానిర్దేశం**

**పర్యావరణానికి నష్టం కలిగిస్తే కఠిన చర్యలు.. రూ.25 వేల వరకు జరిమానా**






ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం

పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాక్రమంలో భాగంగా పర్యావరణ వారోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ గురువారం చండూరు మండలం, బంగారుగడ్డ గ్రామంలో నిర్వహించిన గ్రామసభకు హాజరయ్యారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక సందర్భంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, పర్యావరణ వారోత్సవం లో భాగంగా జూన్ 12 వరకు పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్క నాటి దానిని సంరక్షించాలని అన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చెత్తను వీధుల్లో వేయకుండా ప్రత్యేక చెత్త బుట్టలను ఏర్పాటు చేశామని, గ్రామం స్వచ్ఛతలో ఆదర్శంగా నిలిచి స్వచ్ఛ పురస్కారాలు సాధించేలా కృషి చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకం ద్వారా లభించే నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. గ్రామంలోని బోర్ల మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద తొలి విడతలో అర్హులకు ఇళు మంజూరు చేశామని, రెండో విడతలో గుడిసెల్లో నివసిస్తున్న అర్హులందరికీ ఇళ్లు అందజేస్తామని తెలిపారు. రోడ్డు విస్తరణ కారణంగా ఇళ్లు కోల్పోయిన వారికి గ్రామంలో ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంటే సర్వే నిర్వహించి స్థలాలు పరిశీలించమన్నారు. మహిళా సంఘాల ద్వారా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.1 లక్ష రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. విద్యార్థులు పదో తరగతి తర్వాత చదువును మధ్యలో ఆపకుండా ఇంటర్, డిగ్రీ స్థాయిలో విద్యను కొనసాగించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వ కళాశాలలు, మెడికల్, నర్సింగ్ కళాశాలలు, స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, యువత వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మహిళల ఆర్థిక సాధికారత కు ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా పెట్రోల్ బంకులు, రైస్ మిల్లులు వంటి ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని, స్వయం ఉపాధి చేపట్టాలనుకునే మహిళా సంఘాలకు రుణాలు అందిస్తామని తెలిపారు. వర్షపాతం తక్కువగా ఉండే పరిస్థితుల్లో రైతులు నీటి అవసరం తక్కువగా ఉండే కందులు, పెసర్లు, మినుములు వంటి పంటలను సాగు చేయాలని సూచించారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని నివారించి డెంగ్యూ వంటి వ్యాధులను అరికట్టవచ్చన్నారు. గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం, తాగునీటి నాణ్యతను విలేజ్ వాటర్ లెవల్ కమిటీ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గ్రామాల్లో ఎవెన్యూ ప్లాంటేషన్ కింద నాటిన చెట్లను నరికివేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంట అవశేషాలను కాల్చితే రూ.5 వేల జరిమానా, ఇతరుల పంటలకు నష్టం కలిగించేలా కాల్చితే రూ.25 వేల జరిమానా విధిస్తామని, అవసరమైతే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గ్రామ ఉపసర్పంచ్ మహబూబ్ గ్రామపంచాయతీకి 500 ప్లేట్లు, 500 గ్లాసులను విరాళంగా అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ గ్రామంలో ఇంకుడు గుంతలను నర్సరీలను పరిశీలించి తల్లి పేరుతో రావి మొక్కను నాటారు. ప్రతి కుటుంబం ఒక మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. అంతకుముందు వ్యవసాయ, హార్టికల్చర్, ఆరోగ్యశాఖ అధికారులతో వానాకాలంలో ఎలాంటి పంటలు వేయాలి? ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ శంకర్ నాయక్, తహసిల్దార్ రవికాంత్ శర్మ, ఎంపీడీవో బందారు యాదగిరి, ఇంచార్జ్ ఎం పి ఓ, కార్యదర్శి కోటి, అగ్రికల్చర్ డివిజన్ ఏడి వేణుగోపాల్, సర్పంచ్ బోయపల్లి సునీత, శ్రీను, అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నూతన డీఈఓ సుశీందర్ రావుకు 'ట్రస్మా' ఘన సన్మానం

**విద్యాభివృద్ధికి సహకరించాలని కోరిన అసోసియేషన్ నాయకులు**



అక్షరకలం, చండూరు

నల్గొండ జిల్లా నూతన విద్యాశాఖాధికారిగా (డీఈవో) బాధ్యతలు స్వీకరించిన సుశీందర్ రావును డీఈవో కార్యాలయంలో తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ట్రస్మా జిల్లా అధ్యక్షులు డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ.. డీఈవో నాయకత్వంలో జిల్లా విద్యారంగం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూనే, ప్రభుత్వ నిబంధనలకు లోబడి నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారంలోనూ సహకారం అందించాలని, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను సమానంగా చూడాలని కోరారు. ఈ ఆత్మీయ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర, జిల్లా నాయకులు కందాల పాపిరెడ్డి, జీ.వీ. రావు, మట్ట చెన్నయ్య గౌడ్, కార్పొరేటర్ గంట్ల అనంతరెడ్డి, పుచ్చకాయల వెంకటరెడ్డి, అజీజ్, శంభు లింగారెడ్డి, సత్యనారాయణరెడ్డి, గొట్టిపర్తి చంద్రశేఖర్ తదితర ప్రతినిధులు పాల్గొని నూతన డీఈఓకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## జమీలపేట్‌లో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' గ్రామసభ



అక్షరకలం బిబినగర్

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జమీలపేట్ గ్రామంలో వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా తాగునీరు, వీధుల పరిశుభ్రత, వ్యవసాయం, విద్యుత్ సరఫరా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త పెన్షన్ల మంజూరు, ఉపాధి హామీ పనులు, చెరువులు-కుంటల మరమ్మత్తులపై సమీక్ష జరిపారు. అలాగే డ్రగ్స్ నిర్మూలన, రోడ్డు భద్రత, 'బడిబాట' కార్యక్రమాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జమీలపేట్ గ్రామ సర్పంచ్ బండారి మహేందర్, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మార్వో శ్యాంసుందర్ రెడ్డి, బీబీనగర్ సీఐ ప్రభాకర్ రెడ్డి, వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు. వీరితో పాటు ఉప సర్పంచ్ బాలమణి మల్లేష్ యాదవ్, పాలకవర్గ సభ్యులు కొడిమిళ్ళ శ్రీనివాస్ రెడ్డి, గోపాల్ రాజు, గడ్డం అరుణ, చీనాల సత్యమ్మ, గంగాధర్, బండారు సురేష్, మాజీ ఎంపీటీసీ కొమ్మిడి సుభాష్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ శ్రీకాంత్ యాదవ్ మరియు ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## టియుడబ్ల్యూజే నల్లగొండ డివిజన్ కమిటీ ఎన్నిక

**---అధ్యక్షుడు గా వంగాల శ్రీనివాసరెడ్డి**

అక్షరకలం నల్గొండ

జిల్లాలోని నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో జరిగిన టి యు డబ్ల్యూ జే (ఐజెయు) జిల్లా మహాసభలో జిల్లా అధ్యక్షుడు, గార్లపాటి కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి పులిమామిడి మహేందర్రెడ్డి, ల సమక్షంలో నల్లగొండ డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నల్లగొండ డివిజన్ టీయూడబ్ల్యూజే అధ్యక్షుడిగా వంగాల శ్రీనివాస్ రెడ్డి (సాక్షి), ప్రధాన కార్యదర్శి గా కత్తుల యాదగిరి (ఆంధ్రజ్యోతి), ఉపాధ్యక్షులుగా ఉయ్యాల లింగయ్య (ఆంధ్రప్రభ), చింత యాదగిరి (లోకల్ గైడ్ తెలంగాణ), తల్లమల దశరథ (ప్రజాపక్షం) సహాయ కార్యదర్శులుగా సయ్యద్ (మనం), కట్ట సుధాకర్ (ఈనాడు), కోశాధికారిగా సోమచంద్రశేఖర్ (మనసాక్షి), ల తో




పాటు మరో నలుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కమిటీ సభ్యులను జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాష్ట్ర జిల్లా కమిటీ సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు వంగాల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సంఘ పటిష్టత తో పాటు జర్నలిస్టుల సమస్యలపై రాష్ట్ర కమిటీ సూచనల మేరకు పోరాడుతామన్నారు, అలాగే జర్నలిస్టుల ఐక్యత కోసం వారి హక్కుల సాధన కోసం నిరంతరం పని చేస్తామన్నారు.

## కోదాడ ఆర్టీసీ కార్గోలో 'పటిక' కలకలం



అక్షరకలం కోదాడ

సూర్యాపేట జిల్లా కోదాడ ఆర్టీసీ కార్గో సెంటర్‌లో గురువారం భారీగా పటిక బస్తాలు పట్టుబడటం కలకలం రేపింది. రాజమహేంద్రవరం (రాజమండ్రి) నుండి కోదాడకు ఆర్టీసీ కార్గోలో వచ్చిన నాలుగు బస్తాలలో సారా తయారీకి ఉపయోగించే పటిక ఉన్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. వీటి బరువు సుమారు రెండు క్వింటాళ్లు ఉంటుందని సమాచారం. ఆర్టీసీ డీఎం ఆదేశాలతో అసిస్టెంట్ మేనేజర్ లావణ్య ఈ బస్తాలను డిపోలో భద్రపరిచారు. ప్రస్తుతం వీటిని నిఘా, భద్రతా శాఖ కార్యాలయానికి తరలించి పరిశీలిస్తున్నారు. ?సరుకు బుక్ చేసిన వ్యక్తి ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుండటంతో, ఉదయం సరుకు తీసుకోవడానికి వచ్చే వ్యక్తిని బట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఇది సారా తయారీకి వాడే పటిక లేదా బెల్లమా? అనే కోణంలో నిఘా విభాగం అధికారులు విచారణ జరుపుతున్నారు.

## ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ వైస్ చైర్మన్‌గా ఓరుగంటి ప్రభాకర్

అక్షరకలం కోదాడ



తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ వైస్ చైర్మన్‌గా సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన సీనియర్ నాయకుడు ఓరుగంటి ప్రభాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్ వాసవి భవన్ లో రాష్ట్ర కమిటీ నియామకల్లో భాగంగా జరిగిన కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఓరుగంటి ప్రభాకర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇంతటి బాధ్యతాయుతమైన పదవిని అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే తనకు ఈ నియామకంలో పూర్తి సహకారం అందించిన రాష్ట్ర మహాసభ సీనియర్ నాయకులు ఊరే లక్ష్మణ్, జిల్లా మహాసభ అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వరరావు, కోదాడ పట్టణ అధ్యక్షులు పైడిమరి నారాయణరావులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆర్యవైశ్యులను రాజకీయంగా చైతన్యవంతులను చేసేందుకు, మహాసభ బలోపేతానికి తన శాయశక్తులా కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

## ఆర్వో ఫిల్టర్ మరమ్మత్తు పనులకు శ్రీకారం

అక్షరకలం కోదాడ

చౌటుప్పల్ మున్సిపాలిటీ వాటర్ ఆర్వో ఫిల్టర్ మరమత్తు పనులను చేయించి వార్డు ప్రజలకు త్వరలోనే ఫిల్టర్ ద్వారా త్రాగునీరు అందుబాటులోకి తెస్తానని కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ కుమార్ అన్నారు. దివీస్ పరిశ్రమ,చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్,ల సహకారంతో చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం 13వ వార్డు రాంనగర్ కాలనీలో ఆగిపోయిన ఆర్వో ఫిల్టర్ మరమ్మతు పనులను కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ కుమార్ గురువారం ప్రారంభించారు. మొదట బోరు మరమ్మతులను చేశారు. బోరులో సమృద్ధిగా నీరు ఉండడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బత్తుల వాణి విప్లవ కుమార్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఆర్వో ఫిల్టర్ చెడిపోయిందని వార్డు ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. దివీస్ పరిశ్రమ సహకారంతోనే వాటర్ ఫిల్టర్ నిర్మించడంతో,వాటర్ ఫిల్టర్ మరమ్మత్తుల గురించి పరిశ్రమ యాజమాన్యం దృష్టికి



తీసుకెళ్లానన్నారు. వెంటనే స్పందించిన యాజమాన్యం బోరు,ఫిల్టర్ మరమ్మతులను చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో వర్కాల కుమార్ గౌడ్,చెవగోని వెంకటేష్ గౌడ్,మార్గం నర్సింహ్మా యాదవ్,చెరుకు అశోక్ గౌడ్,గూయని జంగయ్య,చెరుకు సాయి గౌడ్,దివిస్ ప్రతినిధి వెంకటేశ్వర్లు,తదితరులు,పాల్గొన్నారు.

## దేవరకొండ నూతన ఆర్డీఓ పద్మప్రియకు శుభాకాంక్షలు తెలిపిన ఆర్టీఐఏఎస్ రాష్ట్ర అధ్యక్షులు

అక్షరకలం దేవరకొండ:

దేవరకొండ డివిజన్ నూతన రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ)గా బాధ్యతలు స్వీకరించిన పద్మప్రియను గురువారం ఆర్టీఐ యాక్టివిస్ట్ సొసైటీ (ఆర్టీఐఏఎస్) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొర్ర కిషన్ నాయక్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సమావేశంలో డివిజన్ పరిధిలోని పలు ప్రజా సమస్యలపై చర్చించారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వ పాలనలో పారదర్శకతను పెంచాలని, నిరుపేదలకు సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చూడాలని కోరారు. నూతన ఆర్డీఓ నాయకత్వంలో రెవెన్యూ వ్యవస్థ మరింత బలోపేతం కావాలని, ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారం కాగలవని కిషన్ నాయక్ ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# రైతుల అభిప్రాయాల మేరకే కెనాల్ లైనింగ్ పనులు

## కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశం
## రేగట్ట వద్ద ఏఎంఆర్పీ పనుల తనిఖీ



**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**

ఏఎంఆర్పీ హై లెవెల్ కెనాల్ లైనింగ్ పనుల అమలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కనగల్ మండలం, రేగట్ట వద్ద ఏ ఎం ఆర్ పి కెనాల్ లైనింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్కంపల్లి నుంచి మూసీ వరకు సుమారు 67 కిలోమీటర్ల మేర కెనాల్ లైనింగ్ పనులు చేపట్టడం జరుగుతున్నదని, ప్రాజెక్టు పనులను నాలుగు సంవత్సరాల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు జిల్లా కలెక్టర్ కు కలెక్టర్‌కు వివరించారు. పనుల కారణంగా కొంతకాలం నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నందున, రైతులతో ముందస్తుగా అవగాహన సమావేశాలు నిర్వహించి పూర్తి సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు. అలాగే గ్రామాల వారీగా సర్పంచులు, ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలని, రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సమస్యలు తలెత్తకుండా లైనింగ్ పనులు పూర్తి చేయాలని తెలిపారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నెహ్రూ నాయక్, ప్రాజెక్టు మేనేజర్ అభిషేక్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జితేందర్, డిఈ సంపత్, ఏఈలు సంబంధిత అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# ఆగి ఉన్న డీసీఎంను ఢీకొట్టిన మరో వాహనం

## చికిత్స పొందుతూ డ్రైవర్ రాహుల్ మృతి

**అక్షర కలం : చిట్యాల**



నల్గొండ జిల్లా చిట్యాల మండల పరిధిలోని వెలిమినేడు ఫ్లైఓవర్ పై బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రహదారిపై పంచర్ అయి ఆగి ఉన్న డీసీఎం (ఏపీ29 డబ్ల్యూ 0587) వాహనాన్ని, భద్రాచలం నుండి హైదరాబాద్ వెళ్తున్న మరో డీసీఎం (టీజీ 08 టి 8294) వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ?ఈ ప్రమాదంలో వెనుక వాహనాన్ని నడుపుతున్న డ్రైవర్ రాహుల్ ఉత్తమ్ గైక్వాడ్ (29) తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పందించి బాధితుడిని ఆసుపత్రికి తరలించారు. హైదరాబాద్‌లోని మెడిసిటీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడని, ఘటనపై చిట్యాల ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు..

# నేడు డెల్టా స్కూల్ ను ప్రారంభించనున్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**వలిగొండ అక్షరకలం**




యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన డెల్టా స్కూల్ భవనాన్ని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి శుక్రవారం ఉదయం 11 గంటలకు లాంఛనంగా ప్రారంభించనున్నారు 1500 చదరపు గజాల విస్తీర్ణంలో 20 తరగతి గదులను అత్యాధునికంగా నిర్మించారు మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ క్లాస్ లను నిర్వహించేందుకు పాఠశాల యాజమాన్యం అన్ని ఏర్పాట్లు చేసింది డిజిటల్ క్లాసులను ఏసీ గదులలో సీసీ కెమెరాలు పర్యవేక్షణలో విద్యను అందించేందుకు డెల్టా హై స్కూల్ తగుఏర్పాట్లను చేసుకుంది వలిగొండ నుండి భువనగిరి వెళ్లే ప్రధాన రహదారి ప్రక్కన సబ్ స్టేషన్ సమీపంలో సువిశాలమైన మైదానంలో ఈ పాఠశాలను నిర్మించారు 15 సంవత్సరాల నుండి ఈ పాఠశాలను నడుపుతున్నారు ఆది అనుభవంతో అర్హత కలిగిన ఉపాధ్యాయులను నియమించి పాఠశాలను నడుపుతూ ప్రతి ఏటా ఉత్తమ ఫలితాలను సాధిస్తూ వస్తున్నారు. ఇంకా అనేకమంది విద్యార్థులు ఈ పాఠశాల నుండి డాక్టర్లు ఇంజనీర్లుగా ఎదిగారు ఆదే స్ఫూర్తితో విద్యార్థులను తీర్చిదిద్దాలన సంకల్పంతో కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించేందుకు అన్ని సౌకర్యాలతో కూడిన నూతన పాఠశాల భవనాన్ని నిర్మించారు విద్యార్థులకు రక్షణగా పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ నలువైపులా సీసీ కెమెరాలను అమర్చారు ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించే ఈ పాఠశాల భవన కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు మండల ప్రజలు పాల్గొని ఆశీస్సులు అందించాలని పాఠశాల కరస్పాండెంట్ పబ్బు శ్రీధర్ ప్రిన్సిపాల్ వెంకటేష్ కోరారు.

# కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీను నాయక్ కి ఘన సన్మానం

**అక్షర కలం,(చౌటుప్పల్):**



యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గా కరంటోత్ శ్రీను నాయక్ నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో శ్రీను నాయక్ ని మర్యాదపూర్వకంగా కలిసి చాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు కాంగ్రెస్ పార్టీ నాయకులు,సంస్థాన్ నారాయణపురం సింగిల్ విండో డైరెక్టర్ కిషన్ నాయక్,తుంబావి తండా సర్పంచ్ జగన్ నాయక్. సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి,కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలకు ఆయన చేసిన సేవలకు మరోమారు ఆయనను మండల అధ్యక్షుని పదవి వరించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తల ı,తదితరులు, పాల్గొన్నారు.

## సమ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుల నియామకం

**---పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు బొల్గూరి కిరణ్ కుమార్**

**అక్షరకలం నల్గొండ**

తెలంగాణ రాష్ట్రంలో పేదవర్గాలకు రాజ్యాధికారమే లక్ష్యంగా, మహనీయుల సిద్ధాంతాల వెలుగులో సమసమాజ నిర్మాణానికై సమ సమాజ్ పార్టీ తెలంగాణలోని పలు జిల్లాలకు నూతన అధ్యక్షులను నియమించింది. ఈ మేరకు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు బొల్గూరి కిరణ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో నియామకాల వివరాలను వెల్లడించారు. ఈ నియామకాలు తక్షణమే అమలులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్ (హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి) బి. నవీన్ కుమార్, ?నిజామాబాద్ జిల్లా ఎన్. బాలరాజ్,?కామారెడ్డి జిల్లా ఎమ్. శ్రీకాంత్, నల్లగొండ జిల్లా బి. అనిల్ కుమార్, యాదాద్రి భువనగిరి జిల్లా యు. పరశురామ్ లను నియమించినట్లు తెలిపారు.?ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. నూతనంగా నియమితులైన అధ్యక్షులు తక్షణమే జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ కమిటీల నిర్మాణంపై దృష్టి సారించాలని ఆదేశించారు. పార్టీ విస్తరణతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం, ప్రజలను చైతన్య పరిచేందుకు పార్టీ దిశానిర్దేశంలో విస్తృతంగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



# ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన

## వర్షాభావంపై సన్నద్ధం చేయండి వ్యవసాయాధికారులకు మంత్రి తుమ్మల సూచన

**హైదరాబాద్,**



వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులను ముందుగానే సన్నద్ధం చేయాలని ఉన్నతాధికారులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లో వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఎల్ నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటల సాగుపై గ్రామసభల్లో రైతులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తక్కువ నీటితో పంటల సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని అధికారులకు స్పష్టం చేశారు. పంట వ్యర్థాలను కాల్చడంపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అందుకోసం అన్ని జిల్లాల్లో శాటిలైట్ ఆధారిత పంట వ్యర్థాల కాల్చివేతలపై పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. వీటిని నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని వారిని హెచ్చరించారు. కొహెడ అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ శంకుస్థాపనకు ఏర్పాట్లు వేగవంతం చేసినట్లు చెప్పారు. రూ. 2,284.32 కోట్లతో కొహెడలో అంతర్జాతీయ పండ్ల మార్కెట్ నిర్మాణం చేస్తున్నట్లు వివరించారు. జూన్ 6వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరుగుతుందన్నారు. ఇక వ్యవసాయశాఖకు చెందిన ఖాళీ భూముల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తామన్నారు. ఈ ఆస్తుల రక్షణ కోసం ఐఏఎస్ అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఖాళీ స్థలాల్లో ఎ÷-లాంటేషన్ లేదా లీజు ద్వారా ఆదాయం సమీకరణ చేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. తెలంగాణ ప్రభుత్వానికి చెందిన ఫెర్టిలైజర్ యాప్‌కు కేంద్ర ప్రభుత్వం మరోసారి ప్రశంసలు కురిపించిందని చెప్పారు. తెలంగాణ ఎరువుల పర్యవేక్షణ విధానం దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. కేంద్ర ఫెర్టిలైజర్ యాప్ అమలుకు తెలంగాణను పైలట్ రాష్ట్రంగా ఎంపిక చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. యాప్ సమర్థ అమలుకు రాష్ట్రానికి ప్రోత్సాహకాలు అందిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. జూన్ 4, 6, 8, 10 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. రైతులకు క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది సేవలు అందించాలని వారికి మంత్రి పొంగులేటి సూచించారు.

# ఢిల్లీ అగ్నిప్రమాద ఘటనలో అరుదైన దృశ్యం

## ప్రమాదం నుంచి బయటపడేందుకు కిందకు దూకిన బాధితులు
## కింద పరుపులు పరచి కాపాడిన తండ్రీ కొడుకులు
## సోషల్ మీడియాలో వారిపై సరవ్తరా ప్రశంసలు

**న్యూఢిల్లీ,**

దేశరాజధాని ఢిల్లీలోని ఒక లాడ్జ్‌లో బుధవారం జరిగిన ఘోర అగ్ని ప్రమాదం ఘటనలో 21 మంది మృత్యువాతపడ్డారు. అయితే, స్థానికంగా షాపు నిర్వహిస్తున్న తండ్రీకొడుకులు భవనంలో చిక్కుకున్న అనేక మంది ప్రాణాలను కాపాడారు. ప్రస్తుతం వారిపై ప్రశంసల వర్షం కురుస్తోంది. బుధవారం ఉదయం భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అనేక మంది చిక్కుకుపోయారు. వారు కిందకు వచ్చేందుకు ఏ అవకాశమూ లేకపోయింది. దీంతో కొందరు భవనం నుంచి కిందకు దూకేందుకు సిద్ధమయ్యారు. కిందకు దూకితే ఏం కాదుగా అంటూ అక్కడున్న వారిని ఆందోళనతో ప్రశ్నించారు. ఈ క్రమంలో రియాజుద్దీన్, ఆయన కుమారుడు అర్మాన్ రంగంలోకి దిగారు. క్షణకాలం కూడా ఆలస్యం చేయకుండా భవనానికి సమీపంలో నేలపై కొత్త పరుపులను పరిచారు. దీంతో, బాధితులు వాటిపైకి సురక్షితంగా దూకి తమ ప్రాణాలను కాపాడుకున్నారు. 'ఉదయం నేను షాపు వద్దకు వచ్చేసరికే అక్కడ పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో కూడా మంటలు వ్యాపించాయి. లోపలికి వేళ్లేందుకు, బయటకు వచ్చేందుకు అసలు ఏ దారీ లేకుండా పోయింది. మమ్మల్ని కిందకు దూకేయమంటారా అంటూ పై అంతస్తుల్లోని వారు భయంతో ప్రశ్నించారు. దీంతో, వెంటనే నేను మా షాపులోంచి 20 నుంచి 25 వరకూ పరుపులు, క్విల్ట్‌ను తీసుకొచ్చి భవనం బయట పరిచాను' అని అర్మాన్ అన్నారు. 'ఈ క్రమంలో మాకు రూ.2 లక్షల వరకూ నష్టం వచ్చింది. బాధితులకు దుప్పట్లు కూడా ఇచ్చాము. మృతులను బయటకు తెచ్చేందుకు కూడా దుప్పట్లను ఇచ్చాము. మా వద్ద ఉన్నవన్నీ ఇచ్చేశాము. మానవత్వపు కోణంలో చూస్తే ఎవరైనా ఒకటే. హిందువైనా, ముస్లింలైనా మనందరం భారతీయులమే. కాబట్టి, కష్టాల్లో ఉన్న సోదరులకు స్నేహం చేయడం మా బాధ్యత' అని అర్మాన్ తండ్రి రియాజుద్దీన్ అన్నారు. దీంతో, ఈ తండ్రీకొడుకులపై ప్రస్తుతం సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురుస్తోంది.



# తారకళాశాలలో దోస్తు ద్వారా డిగ్రీలో ప్రవేశాలకు చివరి అవకాశం

**సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..**

తారా ప్రభుత్వ కళాశాల, సంగారెడ్డిలో దోస్త్ ద్వారా డిగ్రీ లోని వివిధ కోర్సులలో అడ్మిషన్లు పొందుటకు దోస్తు మూడవ దశ అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఇది చివరి అవకాశం అని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ప్రవీణ తెలిపినారు. తారా ప్రభుత్వ కళాశాల, సంగారెడ్డిలో డిగ్రీలో అడ్మిషన్లకై దోస్త్ ద్వారా రెండవ దశలో సీట్లు వచ్చినవారు తమ సీటును రిజర్వేషన్ చేసుకొనుటకు ఆన్లైన్ సెంటర్ల ద్వారా గాని, మీసేవ ద్వారా గాని రేపటి లోపు సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకోవాలని, లేనిచో వారి సీటు రద్దవుతుందని తెలిపినారు. తారా కళాశాల తెలంగాణలోని ఉన్నతమైన పది కళాశాలలో ఒకటని, ఈ కళాశాలలో బి.ఏ; బి.ఎస్సి. లైఫ్ సైన్సెస్; బి.ఎస్సి. ఫిజికల్ సైన్సెస్; బి.సి.ఏ.; బి.బి.ఏ.; బీ.కాం, కంప్యూటర్స్ వంటి కోర్సులతోపాటు ఉపాధిని కల్పించే బీకాం (బి.ఎఫ్.ఎస్.ఐ); బీ.కాం. (హెచ్.ఆర్); బి.బి.ఏ. (రిటైలింగ్) మరియు బి.ఫార్మసీ. కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ఈ కోర్సులను బోధించడానికి అత్యధిక అనుభవము కలిగిన



అధ్యాపక బృందం అందుబాటులో ఉందని తెలిపినారు. ఈ కళాశాలలో అడ్మిషన్ పొందిన వారికి ఎన్సిసి, ఎన్.ఎస్.ఎస్., క్రీడల వంటి సదుపాయాలతో పాటు విద్యార్థులు రాష్ట్ర ,జాతీయ స్థాయి శిబిరాలలో పాల్గొనుటకు అవకాశం ఉందని తెలిపినారు. కళాశాలలో సైన్స్ విద్యార్థులకు ఆధునిక సదుపాయాలు కలిగిన లాబరేటరీ సదుపాయాలు ఉన్నాయని, కంప్యూటర్ విద్యార్థులకు పూర్తి సదుపాయాలతో కంప్యూటర్ ల్యాబ్లు ఉన్నాయని, విద్యార్థులకు జిమ్ సదుపాయం కూడా అందుబాటులో ఉందని తెలిపారు. వీటన్నింటితో పాటు అన్ని కోర్సులకు సంబంధించిన పుస్తకాలు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలతో అతిపెద్ద లైబ్రరీ సదుపాయం బాటులో ఉందని, వీటన్నింటితో పాటు ఎస్సీ ,ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు స్కాలర్షిప్ సదుపాయం ఉందని, మరియు పదవ తరగతి, ఇంటర్మీడియట్ ప్రభుత్వ పాఠశాల, మరియు కళాశాలలో చదివిన అమ్మాయిలకు అజిత్ ప్రేమ్ జీ ఫౌండేషన్ సంవత్సరానికి 30 వేల స్కాలర్షిప్ సదుపాయాన్ని అందిస్తున్నదని, అదే విధంగా అమ్మాయిలకు సంవత్సరానికి ?10,000 వరకు మలబార్ గోల్డ్ స్కాలర్షిప్ సదుపాయం అందుబాటులో ఉందని తెలిపినారు. కావున దోస్తు ద్వారా మూడవ దశ అడ్మిషన్ల ప్రక్రియ ఈనెల 15వ తారీకు వరకు ఉందని, డిగ్రీ చదివే విద్యార్థులు తారా కళాశాలకు మొదటి ప్రాధాన్యతను ఇచ్చి అడ్మిషన్ పొందాలని తెలిపినారు. దోస్తు ద్వారా డిగ్రీలో అడ్మిషన్ పొందడానికి ఇదే చివరి అవకాశం అని, విద్యార్థులు దీనిని గమనించి తారా కళాశాలలో మూడవ దశ అడ్మిషన్లలో మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని తెలిపినారు. తారా కళాశాల సంగారెడ్డి జిల్లాలోని ఐడి కళాశాలని, ఈ కళాశాలకు జాతీయస్థాయి న్యాప్ ఏ ప్లస్ గ్రేడ్ లభించిందని, అత్యున్నతమైన విలువలు కలిగిన, అనుభవము కలిగిన అధ్యాపక బృందం కలిగినటువంటి ఈ కళాశాలలో విద్యార్థులు అడ్మిషన్ పొందాలని తెలిపినారు. దోస్తు ద్వారా మూడవ దశ అడ్మిషన్లు ఈనెల 15వ తేదీ చివరి అవకాశం అని పేర్కొన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే అభ్యర్థులు నేరుగా కళాశాలను సందర్శించి వారి సందేహాలను నివృత్తి చేసుకోవాలని పేర్కొన్నారు.

# పెండింగ్ లో ఉన్న స్కావెంజర్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి




**అక్షర కలం సిద్దిపేట జూన్ 04:**

సిద్దిపేట జిల్లా నూతన డిఈఓ గా వరగంటి శాస్త్రి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా టిపిటిఎఫ్ సిద్దిపేట జిల్లా శాఖ పక్షాన నూతన డీఈవో ని కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు చిట్యాల విజేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్, ఉపాధ్యాయ సంపాదక వర్గ సభ్యులు ఎస్. కనకయ్య తో కలిసి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గాడిపల్లి తిరుపతి రెడ్డి డీఈవో తో మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి సంబంధించి స్కావెంజర్ వేతనాలు నాలుగు నెలలు పెండింగ్లో ఉన్నాయని, మరియు 2025-26 సంవత్సరానికి సంబంధించి మూడు నెలల స్కావెంజర్ వేతనాలు పెండింగ్లో ఉన్నాయని వెంటనే వేతనాల విడుదలకు చర్యలు తీసుకోవాలని, పెండింగ్లో ఉన్న ఉపాధ్యాయుల సర్వీస్ క్రమబద్ధీకరణ ఉత్తర్వుల విడుదలకు వెంటనే చర్యలు తీసుకోవాలని డీఈవో గారిని కోరారు. అనంతరం డిఈవో కి వినతి పత్రం సమర్పించారు. ఇట్టి కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ రామస్వామి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు మహమూద్ జిల్లా ఉపాధ్యక్షులు అజీజ్, రాములు, జిల్లా కార్యదర్శి రాంరెడ్డి, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, నర్సింలు, సత్తయ్య,ఎల్లం, రాములు,రాజేందర్, సీనియర్ నాయకులు కొండల్ రెడ్డి, యాదగిరి, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫారెస్ట్ కార్యాలయంలో ఏసీబీ దాడులు రూ.80 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఎఫ్ఆర్ఓ మొయినొద్దీన్

**జగిత్యాల జూన్ 4 (అక్షర కలం)**

జిల్లా కొడిమ్యాల మండలంలోని ఫారెస్ట్ కార్యాలయంలో గురువారం ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.80 వేల లంచం తీసుకుంటుండగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్ఓ) మొయినొద్దీన్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు సమాచారం. ఫిర్యాదు మేరకు పక్కా ప్రణాళికతో వల ఏసీబీ అధికారులు, లంచం స్వీకరిస్తున్న సమయంలోనే అధికారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కార్యాలయంలో తనిఖీలు నిర్వహించి సంబంధిత పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనతో కొడిమ్యాల ఫారెస్ట్ శాఖలో కలకలం రేగింది. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.




# ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి చొరవతో ధాన్యం నిల్వలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

## నంగునూర్ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి

**అక్షర కలం సిద్దిపేట జూన్ 04:**

ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి, డాక్టర్ వివేక్ వెంకట స్వామి ప్రత్యేక చొరవతోధాన్యంనిల్వలకుప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరిగాయాని నంగునూర్ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి తెలియజేశారు. గురువారం గట్ల మల్యాల, పాలమకుల గ్రామాలలో ఉన్నా గోదాములను, గట్ల మల్యాల, ఖాతా, అంకుశపూర్, ముండ్రాయి మరియు రాజగోపాల్ పేట గ్రామాల ధాన్యాన్ని నిల్వలలు చేయడానికి ఇంచార్జి మంత్రి ఆదేశాల తో జిల్లా కలెక్టర్ రైతులకోసం గోదాములు కేటాయించారాని పేర్కొన్నారు. రైస్ మిల్లులలో ధాన్యానికి సరిపడస్థలం లేకుండా రైతులు అరుగళ్ళం కస్టపడి పండించిన వరి ధన్యనికీ నష్టం జరగకుండా ఈ విధంగా అదుకోవడం సంతోషింప దగ విషయం అన్నారు. పిఎసిఎస్ వారికీ, డ్వాక్రా మహిళా గ్రూప్ లకు ఎలాంటి సబందం



లేకుండా ప్రభుత్వం నేరుగా కొనుగళ్ళు చేసి,డబ్బులు చెల్లించి ప్రత్యేక గోదాములలో నొల్వలు చేసి ఎన్నడు లేని విధంగా రైతులను ఆదుకోవడం చాలా ఘర్వించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమం లో ఖాతా సర్పంచ్ పుల్లూరు సోనీ మహేష్,రెవెన్యూ ఇన్స్పెక్టర్, లింగం యాదవ్, జీపీవో లు మమత, రమేష్, ఉపసర్పంచ్ లు, తిప్పని శ్రీనివాస్, ఏ టి చంద్రం, మార్కెట్ డైరెక్టర్ గాండ్ల రమేష్, పిఎసిఎస్ డైరెక్టర్ గంగుల రవి,కరెడ్ల వెంకట్ రెడ్డి,డ్వాక్రా మహిళా సంఘాల సి సి లు కాంగ్రెస్ నాయకులు భాస్వరాజు రాములు,ఆరెపల్లి సురేష్, రాజు, చంద్రం,పాల్గొన్నారు.

# జన హృదయ నేత జన్మదిన వేడుకలు

## రక్తదాన శిబిరాల నిర్వహణ..

## 75 యూనిట్ల రక్త దానం

## ఆలయాల్లో ప్రత్యేక పూజలు

**అక్షర కలం సిద్దిపేట జూన్ 04:**

మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మండల వ్యాప్తంగాఘనంగానిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేకులు కోసి మిఠాయిలు పంచి పెట్టారు. ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రక్త దాన శిబిరాలు నిర్వహించారు. పాలమాకుల లో ఉపాధి హామీ కూలీలకు సల్ల ప్యాకెట్ల పంపిణీ చేశారు. అలాగే మండల పరిధిలోని కోనాయిపల్లిలోని కేసీఆర్ సెంటిమెంట్ దేవాలయమైన శ్రీ వెంకటేశ్వరాలయంలో ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల శాఖ తాజా మాజీ అధ్యక్షుడు అనగోని లింగం గౌడ్, మాజీ ఉమ్మడి మెదక్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ రాగుల సారయ్య, సిద్ధిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వేముల









వెంకట రెడ్డి, మాజీ ఎంపీపీలు దువ్వల మల్లయ్య, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు కోల రమేశ్ గౌడ్,ఎల్లంకి మహిపాల్ రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు రేకులపల్లి సంతోష్ రెడ్డి, పాలమాకుల సర్పంచ్ పోతర బోయిన ఓజాల్ ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు చౌడుచర్ల జయపాల్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సిరికొండ మణి, రంగు రాజు, బెదురు తిరుపతి, కోల శ్రీధర్ గౌడ్, అనగోని పరశురాములు,ఏటి పరమేశ్వర్, మాయోజు చక్రపాణి, తిప్పని నాగేందర్,పాకాల శ్రీనివాస్, వీర్యానాయక్, నిమ్మ శ్రీనివాస రెడ్డి,వేణుచక్రవర్తి,అయిలయ్య, పంగ రవి,వరదోలు వెంకటేష్, శామంతుల కనకరాజు,రాకేష్, రాజు,స్వామి,భిక్షపతి నాయక్, సుందు పరశురాములు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కేకు కోసి సీట్లు పంచిపెట్టారు. నర్మెట, నంగునూరు, రాంపూర్, రాజగోపాలపేట, గట్లమల్యాల గ్రామాలలో కేకు కట్ చేశారు. నంగునూరు, రాజగోపాలపేట, గట్లమల్యాల గ్రామాలోని ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రాంపూర్ లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో హరీశ్ రావు అభిమానులు 21 యూనిట్ల రక్తాన్ని ఇచ్చారు. ఈ రక్త యూనిట్లను మిత్ర బ్లడ్ బ్యాంక్ కు అప్పగించారు. రాజగోపాల పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన రక్త దాన శిబిరంలో మొత్తం 54 యూనిట్ల రక్తాన్ని ఇచ్చారు.

# పసుపుల గ్రామంలో బడిబాట ర్యాలీ, :

– గ్రామ అభివృద్ధి అంశాలపై గ్రామసభ నిర్వహణ




**(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, జూన్,04)**

పసుపుల గ్రామంలో గురువారం సర్పంచ్ నర్మదా రవి కుమార్ గౌడ్ అధ్యక్షతన, మండల విద్యాధికారి మీర్జా ఖలీముల్లా ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించబడింది. గ్రామ అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలు చర్చించబడిన ఈ సమావేశంలో బడిబాట కార్యక్రమానికి సంబంధించి ర్యాలీ మరియు ప్రతిజ్ఞ కార్యక్రమాలు గ్రామ ప్రజల సహకారంతో నిర్వహించే నిర్ణయం తీసుకోబడింది. ఎంఈఓ సమావేశంలో ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు కల్పించే సౌకర్యాల గురించి వివరించారు. పాఠశాలలలో శుద్ధి, చుట్టుపక్కల శాంపిల్ సదుపాయాలు, విద్యా సామగ్రి నాణ్యత, మరియు పిల్లల విచ్ఛిన్నతను తగ్గించే చర్యలపై ఎంఈఓ ప్రత్యేకంగా ప్రకటనలు చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ పథకంతో కూడిన బడిబాట కార్యక్రమంలో ప్రతి గ్రామంలో ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంపుకు కృషి చేస్తున్నట్లు అధికారులు తెలియచేశారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామస్థుల్లో విద్యాపై అవగాహన పెంపొందించడం, అమ్మకట పిల్లలను పాఠశాలకు తీసుకురావడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ మహేష్ కుమార్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రావణి , ఉపాధ్యాయురాలు ఆఫ్రీన్ అంజుమ్ , గ్రామ సెక్రెటరీ శేఖర్ , గ్రామ వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లు మరియు అనేక గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఓణీల ఫంక్షన్ లో పాల్గొన్న "దయాకర్ రెడ్డి " చల్లా కృష్ణ "

**అక్షర కలం/ దానవాయిగూడెం:**

పాలేరు నియోజకవర్గ 59 డివిజన్ దానవాయిగూడెం గ్రామానికి చెందిన నాగటి కోటేశ్వరరావు – అమృత కుమార్తె, ఓణీల ఫంక్షన్ కి వెళ్లి నాగటి కోటేశ్వరరావు కుటుంబాన్ని ఆశీర్వదించిన పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ ఆఫీస్ ఇంచార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ఈ కార్యక్రమంలో చల్లా కృష్ణ అన్న తన టీమ్ సభ్యులతో పాల్గొన్నారు







# చోరీ కేసు ఛేదించిన ఖమ్మం సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులను అభినందించిన వరంగల్, ఖమ్మం పోలీసు కమిషనర్లు



**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి :**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఖఖజ పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నెం. 669/2025, 670/2025 మరియు 14/2026 (సెక్షన్ 331(3), 305(ఖ) దీటీూ కింద) కేసులో పశ్చిమ బెంగాల్‌కు చెందిన ముగ్గురు ఇతర రాష్ట్ర నేరస్థులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఖమ్మం సెంట్రల్ క్రైమ్ స్టేషన్ సిబ్బందిని, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు. వివరాలలోకి వెళ్ళితే.. ఇటీవల వరంగల్ జిల్లా,ఖఖజ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితులు చోరీ సొత్తుతో ఖమ్మం మీదుగా వెళ్లే రైల్లో పారిపోతున్నట్లు సీసీ టీవీ పుటేజ్ ఆధారంగా గుర్తించిన వరంగల్ జిల్లా పోలీసులు వెంటనే ఖమ్మం జిల్లా పోలీసులకు సమాచారం అందించారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాలతో రంగంలోకి దిగిన ఖమ్మం జిల్లా సెంట్రల్ క్రైమ్ స్టేషన్ సిబ్బంది ప్రయాణికుల్లాగా ఖమ్మంలో రైలు ఎక్కి ప్రతి రైలు భోగిని క్షుణ్ణంగా పరిశీలిస్తూ... రైలు మధిరకు వచ్చే సరికి పశ్చిమ బెంగాల్ కు చెందిన ూని. ఫిరోజ్, ూని. ఎమిన్,ూని.సుఖ్ చంద్ అనే ముగ్గురు నిందుతులను గుర్తించి చాకచక్యంగా పట్టుకొని వరంగల్ జిల్లా పోలీసులకు అప్పగించారు. ఈ నేపథ్యంలో ఖమ్మం జిల్లా సెంట్రల్ క్రైమ్ పోలీసులు తక్షణమే స్పందించి అందించిన అమూల్యమైన సహకారానికి వరంగల్ జిల్లా పోలీస్ కమిషనర్ సన్ ప్రిత్ సింగ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ అందించిన ప్రశంస పత్రాన్ని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చేతుల మీదుగా సిబ్బందికి గురువారం అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, సిసిఎస్ ఏసీపీ సర్వర్ పాల్గొన్నారు.

# ధాన్యం దిగుమతి వేగవంతం చేయాలి

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 04:**

ధాన్యం కొనుగోలు ప్రక్రియలో భాగంగా కొనుగోలు కేంద్రాల నుండి తరలించిన ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో గల స్టేట్ వేర్ హౌస్ కార్పొరేషన్ గోదామును మండల తహశీల్దార్ సంతోష్ కుమార్ తో కలిసి సందర్శించి ధాన్యం, మొక్కజొన్నల దిగుమతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసి కేటాయించిన ప్రకారం తరలించడం జరుగుతుందని తెలిపారు. ధాన్యంతో పాటు గోదాములకు వచ్చిన మొక్కజొన్నలను దిగుమతి చేసి నిల్వ చేయాలని నిర్వాహకులకు సూచించారు. హమాలీల వేతనల చెల్లింపులపై పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ తో మాట్లాడి సకాలంలో కూలి డబ్బులు చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955